RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org


గురువారం 12.02.2026 | సంపుటి :12 సంచిక : 204 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్



• తెలంగాణలో 10 మంది ఐఏఎస్‌ల బదిలీ..

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో 10 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్ నియమితులయ్యారు. ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ బాధ్యతలు చేపట్టనున్నారు. గిరిజన సంక్షేమ ప్రత్యేక సీఎస్‌గానూ ఆయన కొనసాగనున్నారు. మిగతా 2లో..

## మూసీ ప్రాజెక్టులో ముందడుగు



భూసేకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్

**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ పక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధిలో అధికారులు మిగతా 2లో..



# ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

**70% పైగా ఓటింగ్**

## కొడంగల్‌లో ఓటేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాయంత్రం క్యూలో ఉన్న వారికి ఓటింగ్ అవకాశం • ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



**హైదరాబాద్,కొడంగల్(జనంసాక్షి):** చెదురుమొదురు ఘటనలు మినహా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి మాత్రమే అధికారులు ఓటు వేసే అవకాశం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 13న ఓట్లు లెక్కింపు ఉంటుందని, 16న కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. తుది ఓటింగ్ శాతం రాత్రికి వెల్లడి కానుంది. ఎన్నికల బరిలో ఉన్నవారి అదృష్టం ఈనెల 13న తేలబోతుంది. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ఉంటుంది. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ పక్రియ, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అక్కడక్కడా మిగతా 2లో..



## సంక్షేమ పథకాలతోనే కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

మున్సిపాలిటీ ఎన్నికల్లో సన్నబియ్యం 'గేమ్ చేంజర్'గా మారింది

: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కోదాడ(జనంసాక్షి):** రాష్ట్రంలోనిమున్సిపాలిటీ,కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వంద శాతం విజయం సాధిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు, మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా కోదాడలో 14వ వార్డు నందు సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తో కలిసి ఓటు హక్కు 2లో..

## ప్రజాప్రభుత్వానికే ఓటర్లు పట్టం కట్టారు

90 శాతం మున్సిపాలిటీలు కాంగ్రెస్‌వే: మహేశ్ గౌడ్ ధీమా



## ఎగ్జిట్‌పోల్‌లో కాంగ్రెస్ హవా

### మున్సిపల్ ఎన్నికల్లో హస్తానికే ఆధిక్యం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ ముగిసింది. ఈనెల 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్లు 'పీపుల్స్ పల్స్' ఎగ్జిట్ పోల్ సర్వే తెలిపింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కొనసాగుతుందని పేర్కొంది. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను భాజపా కైవసం చేసుకునే అవకాశాలున్నాయని, ఈ రెండు కార్పొరేషన్లలో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించనుందని అంచనా వేసింది.రాష్ట్రంలోని 68-76 మున్సిపాలిటీలను హస్తం పార్టీ, 29-36 మున్సిపాలిటీలను బీఆర్ఎస్, 3-5 మున్సిపాలిటీలను భాజపా, 0-1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. 8-14 మున్సిపాలిటీల్లో 'నువ్వా నేనా?' అన్నట్టు పోటీ మిగతా 2లో..

## ఓటమి భయంతోనే భాజపా, బీఆర్ఎస్ గొడవలు సృష్టించాయి

మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్(జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వంపై బురద జల్లేలా.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మున్సిపల్ ఎన్నికల్లో భాజపా, బీఆర్ఎస్ గొడవలు సృష్టించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. పురపాలికల్లో కాంగ్రెస్ గెలుస్తుందనే భయంతోనే రెండు పార్టీలు ఒక్కటై ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించాయని ఆరోపించారు. పట్టణ ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ప్రజలు నిర్ణయించుకున్నారన్న మంత్రి వార్తాపత్రికల్లో ఇచ్చిన ప్రకటనలకు భాజపా కట్టుబడి ఉండాలన్నారు. ఎన్ని కుట్రలు చేసినా.. పురపాలికలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మిగతా 2లో..

## అడుగడుగునా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం: హరీశ్‌రావు



**హైదరాబాద్(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ మిగతా 2లో..




## 'పుర'పోలింగ్ ప్రశాంతం

డీజీపీ బి. శివధర్ రెడ్డి

**హైదారాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ బి.శివధర్ రెడ్డి తెలియజేశారు. బుధవారం తన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ భగవత్‌తో కలిసి ఆయన రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా పర్యవేక్షించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో జరుగుతున్న పోలింగ్‌ను వెబ్‌కాస్టింగ్ ద్వారా నేరుగా వీక్షిస్తూ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిజిపి మాట్లాడారు. వెబ్‌కాస్టింగ్ విధానం ద్వారా రాష్ట్రంలోని పోలింగ్ స్టేషన్ల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు కలిగిందని, ఈ కెమెరాల నిఘా కారణంగాను, పోలీస్ సిబ్బంది బందోబస్తు వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అదుపులో ఉన్నాయన్నారు .ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో మిగతా 2లో..

## మూడు కార్పొరేషన్లుగా జీహెచ్‌ఎంసీ




• 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా విభజన
• జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
• జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్

**హైదరాబాద్(జనంసాక్షి):** జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా స్రామాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం. సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్‌ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. మిగతా 2లో..

**శంషాబాద్ జోన్:**
ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్
**చార్మినార్ జోన్:**
సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్.
**ఖైరతాబాద్ జోన్:**
ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట
రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్
**గోల్కొండ జోన్:**
గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్
సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

## ఓర్చుకోలేకే కాంగ్రెస్ విమర్శలు

### భారత్ అభివృద్ధిని కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోంది



కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని చూసి కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని.. అందు వల్లే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందనే ఆధా రాలు చూపాలని రాహుల్‌కు సవాల్ విసిరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాహుల్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీపై లోక్‌సభలో తీవ్రమైన ఆరోపణలు చేశారని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ హక్కులను ఉల్లంఘిస్తూ.. కేంద్రమంత్రిపై చేసిన ఆరోపణలకు గానూ విపక్ష నేతపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ చేస్తామన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో మిగతా 2లో..

## అమెరికాకు లొంగిపోయి భారత్‌ను అమ్మేశారు

### మనమెక్కడ చమురు కొనాలో వారు నిర్ణయిండమేంటి?

### ఒప్పందంతో అగ్రరాజ్యానికే మేలు : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు."ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో మిగతా 2లో..

## స్పష్టమైన వైఖరితోనే అగ్రరాజ్యంతో వాణిజ్య చర్చలు

కొన్ని ఉత్పత్తులకు మార్కెట్ తెరవలేమని చెప్పేశాం

: భారత వాణిజ్య కార్యదర్శి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికాతో ఖరారైన ట్రేడ్ డీల్ గురించి భారత వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశానికి అత్యంత కీలకమైన రంగాలను దృష్టి ఉంచుకొని స్పష్టమైన వైఖరితోనే అగ్రరాజ్యంతో వాణిజ్య చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ట్రేడ్‌డీల్‌పై రెండు దేశాలు చేసిన సంయుక్త ప్రకటనను చట్టబద్ధంగా మార్చే దిశగా పని జరుగుతోందని చెప్పారు. మార్చి చివరి నాటికి ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే మిగతా 2లో..

## అమెరికా మమ్మల్ని టాయ్‌లెట్ పేపర్ కన్నా నీచంగా వాడుకుంది

• అనవసర యుద్ధాల్లోకి మమ్మలను లాగారు
• అఫ్ఘాన్ వ్యతిరేక యుద్ధం:లో పాల్గొనడంతో తీరని నష్టం
• అగ్రరాజ్య తీరుపై పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా తీవ్ర విమర్శలు



**ఇస్లామాబాద్(జనంసాక్షి):** ఒక దేశానికి ఇంత కంటే అవమానం ఏముంటుందీ.. ప్రతి దానికీ అడుక్కోవటం మొదలైతే ఇంత కన్నా విలువ ఎవరిస్తారు.. పక్క దేశంపై ఏడుపులు, పెడబొబ్బులు.. దాడులు.. కుట్రలు, విధ్వంసంతో నిత్యం హింసతో బతికే దేశానికి ఇంత కంటే గౌరవం ఎవరిస్తారు.. ఇవన్నీ మన పక్కనే ఉన్న పాకిస్తాన్ దేశం గురించే.. పాకిస్తాన్ దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే నీచంగా.. నీచాతి నీచంగా చూస్తున్నారని స్వయానా రక్షణమంత్రి వాపోయారు. స్వయంగా పాక్ పార్లమెంట్‌లో ఏడుస్తూ చెప్పిన మాటలు.. పాకిస్తాన్ దేశం గౌరవం అమెరికా దగ్గర ఎలా ఉంది అంటే.. టాయిలెట్ పేపర్.. టిష్యూ పేపర్ కంటే నీచంగా ఉందంటూ ఆయన మా ట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్ ఖవాజా ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా షాకింగ్ కామెంట్స్ చేశారు. అమెరికా తన సొంత ప్రయోజనాల కోసం పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ కంటే మిగతా 2లో..

## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

• జగనణమన కంటే ముందే వందేమాతరం
• ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

## స్కూల్‌లో నరమేధం

• థాయిలాండ్‌లో దుండగుడి కాల్పుల్లో 34మంది మృతి
• మృతుల్లో 22మంది చిన్నారులు

స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం..

## నోటీసులో లోపాలు

వివరాలు లోపలి పేజీల్లో..

జనంసాక్షి www.janamsakshi.org

గురువారం 12.02.2026

# సంక్షేమ పథకాలతోనే కాంగ్రెస్ క్లీన్ స్వీప్

నియమించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం ఈ ఎన్నికల్లో 'గేమ్ ఛేంజర్'గా మారి పార్టీని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యం అందిస్తూ పేదల ఆకలి తీరుస్తోందని, ఇది ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచిందని ఆయన పేర్కొన్నారు.సంక్షేమ పథకాలు: సన్న బియ్యంతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయడానికి దోహదపడతాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.రేషన్ కార్డులు: గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్షలాది మందికి కొత్త కార్డులు మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు.అభివృద్ధిపై హామీ: మున్సిపాలిటీల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తాగునీరు మరియు మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు.

## ప్రజాప్రభుత్వానికే ఓటర్లు పట్టం కట్టారు

**హైదరాబాద్(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కనిపించిందని, 90 శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు తమ పార్టీ ఖాతాలో పడనున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. అత్యధిక స్థానాల్లో హస్తం పార్టీ ఆధిక్యం సాధించబోతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్న విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తాయన్నారు.ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు.. ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పీసీసీ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు.

## ఓర్చుకోలేకే కాంగ్రెస్ విమర్శలు

భారత్ అభివృద్ధిని కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోంది: కేంద్రమంత్రి

ఉన్నప్పటికీ రాహుల్ తాను అడిగిన ప్రశ్నలకు ఇతరులు చెప్పే సమాధానాలు వినకుండానే సభ నుంచి వెళ్లిపోతారని మండిపడ్డారు. ఒక సభ్యుడు ప్రసంగం చేసిన వెంటనే సభ నుంచి బయటకు వెళ్లకూడదనే నియమం ఉందని ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. ఇదీ చదవండి: మనమెక్కడ చమురు కొనాలో అమెరికా చెబుతోంది: రాహుల్ గాంధీ

## అమెరికాకు లొంగిపోయి భారత్‌ను అమ్మేశారు

అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించింది" అని రాహుల్ గాంధీ అన్నారు."మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోంది. " అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బడ్జెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

## స్పష్టమైన వైఖరితోనే అగ్రరాజ్యంతో వాణిజ్య చర్చలు

అవకాశాలు కనిపిస్తున్నాయి. "అన్ని ఒప్పందాల విషయంలో స్పష్టమైన వైఖరితోనే భారత్ చర్చలు జరిపింది. మన రైతులు, మత్స్యకారులు, పాడిపరిశ్రమ.. ఇలా ప్రభావితం అవుతాయనుకున్న రంగాలను దృష్టిలో ఉంచుకొని.. వాటిని రక్షించేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. ఆయా మార్కెట్లను తెరవలేమని భాగస్వామ్య దేశాలకు స్పష్టంగా వెల్లడి చేశాం. ఇప్పటివరకు జరిగిన ఒప్పందాల్లో అన్ని సున్నితమైన రంగాలకు రక్షణ కల్పించాం. అంతగా సున్నితం కానీ రంగాల విషయంలో మాత్రం.. మన మార్కెట్‌ను తెరిచేందుకు సుంకాలను ఉపయోగించాం" అని అగర్వాల్ స్పష్టత ఇచ్చారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఇప్పటికే లోక్‌సభలో మాట్లాడిన పీయూష్ గోయల్ అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు బలపడతారని పేర్కొన్నారు. ఈ డీల్ వల్ల భారత రైతులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎటువంటి నష్టం ఉండదని చెప్పారు. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాంల కన్నా తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయని పేర్కొన్నారు.

# ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్





స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. అలాగే సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట టోకెన్లు జారీ చేసి ఓటింగ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేస్తారు. పోలీసుల భారీ భద్రత నడుమ వీటిని నిర్దేశించిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే దాదాపు 62శాతం పైగా పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో ఓటింగ్ శాతం కార్పొరేషన్ల కంటే మెరుగ్గా ఉన్నట్లు ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలన్నీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

ఓటేసిన పలువురు ప్రముఖులు

మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కను వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

**ఓటు హక్కు వినియోగించుకున్న పిసిసి చీఫ్**

పట్టణంలోని సన్ ఫ్లవర్ హైస్కూల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం ఓటు అని, ఓటింగ్ శాతం పెరిగినప్పుడే సమాజానికి మేలు చేసే నాణ్యమైన నాయకులు వస్తారని పేర్కొన్నారు. నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూనే, బీజేపీ మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని విమర్శించారు. అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మూసీ ప్రాజెక్టులో కీలక ముందడుగు

భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు .హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు పక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ పక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి. మొత్తం గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో, 14 మండలాలు, 46 గ్రామాల్లో మూసీ అభివృద్ధి జరగనుంది.

## మూడు కార్పొరేషన్‌లుగా జీహెచ్‌ఎంసీ

జీహెచ్‌ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

## ఎగ్జిట్‌పోల్‌లో కాంగ్రెస్ హవా

ఉందని పేర్కొంది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు 36 శాతం, బీఆర్ఎస్‌కు 29.7 శాతం, భాజపాకు 19.3 శాతం, ఎంఐఎంకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించింది. కాంగ్రెస్ పార్టీ 1210-1290 వార్డుల్లో, బీఆర్ఎస్ 860-930, భాజపా 250-270, ఎంఐఎం 35-44, సీపీఐ 12-17, సీపీఎం 10-14, ఇతరులు 90-110 వార్డులు గెలుచుకునే అవకాశముందని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ కూడా గెలిచే అవకాశాలు లేవు.

కార్పొరేషన్ల వారీగా అంచనాలు..

రామగుండం: కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, భాజపా 3-6, ఇతరులు 4-7 డివిజన్లు

మంచిర్యాల: కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, భాజపా 6-9, ఇతరులు 1-2

కొత్తగూడెం: కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4

మహబూబ్‌నగర్: కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, భాజపా 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1

నల్గొండ: కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, భాజపా 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2

నిజామాబాద్: కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, భాజపా 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2

కరీంనగర్: కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, భాజపా 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3

## సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్

పంచాయతీరాజ్ కమిషనర్‌గా దివ్యకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియాకు అదనపు బాధ్యతలు నిర్వహించ నున్నారు. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా కాత్యాయనీ దేవి బదిలీ అయ్యారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎండీగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. జలమండలి జేఎండీగా మయాంక్ మిట్టల్ నియమితులయ్యారు. పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శిగా రఘురామ్‌శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్‌డీగా అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు.

## అడుగడుగునా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం: హరీశ్‌రావు

వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు.చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు.

## వందేమాతర గీతం ఇక తప్పనిసరి

**జగణమన కంటే ముందే వందేమాతరం**

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా అన్ని పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని తెలిపింది. అయితే సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కొత్త నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నారు.ఇదిలా ఉంటే.. బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్‌మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి. స్వాతంత్య్ర పోరాట సమయంలో ముస్లింలీగ్ అభ్యంతరాల మేరకు.. ఆరు భాగాల్లోంచి ఎలాంటి మతపరమైన ప్రస్తావనా లేని తొలి రెండింటిని మాత్రమే కాంగ్రెస్ స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వివాదంలేని తొలి రెండు భాగాలతో.. వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది.

# 'పుర'పోలింగ్ ప్రశాంతం

పోలీసు సిబ్బంది అం కితభావంతో పాటు ఈ ఆధునిక వెబ్‌కాస్టింగ్ సాంకేతికత ఎంతగానో తోడ్పడిందని ఆయన ప్రశంసించారు.ఈ ఎన్నికల కోసం తెలంగాణ పోలీసులు అత్యంత పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారని డీజీపీ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,203 పోలింగ్ స్టేషన్లను కవర్ చేస్తూ భారీ ఎత్తున భద్రతను కల్పించామన్నారు. వీటిలో 1,302 అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్), 1,926 సమస్యాత్మక (సెన్సిటివ్) మరియు 4,975 సాధారణ కేంద్రాలుగా గుర్తించి, ఆయా ప్రాంతాల తీవ్రతను బట్టి బలగాలను మోహరించినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖతో పాటు ఇతర విభాగాల నుంచి సుమారు 3,000 మంది అదనపు బలగాలను రప్పించామని, ఇందులో టీజీఎస్పీ, ఫారెస్ట్, ఎక్సైజ్, సీఐడీ మరియు లీగల్ మెట్రాలజీ విభాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం లోపల మరియు అత్యంత సమస్యాత్మక కేంద్రాల వెలుపల వంద శాతం వెబ్‌కాస్టింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, దీనివల్ల ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత సాధ్యమైందని ఆయన వెల్లడించారు.వృద్ధులు ఓట్లు వేసేలా పోలీసుల సహాయం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వృద్ధులు ఓట్లు వేసేందుకు పోలీస్ సిబ్బంది సహాయం చేశారు . నిజామాబాదులో సిపి శ్రీ పి. సాయి చైతన్య , నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, పెద్దపెల్లి డిసిపి బి రామ్ రెడ్డి వృద్ధ ఓటర్లను , వికలాంగులను వీల్ చైర్ లో పంపించారు .ములుగు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న నాలుగో బెటాలియన్ సిబ్బంది మూర్ఛ వచ్చి పడిపోయిన ఓటరుకు ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా అక్కడ ఉన్న వృద్ధ ఓటర్లను పోలింగ్ కేంద్రంకు తీసుకువెళ్లి ఓట్లు వేసేలా సహాయ పడ్డారు. అదేవిధంగా, సంగారెడ్డి జిల్లా లోని జిన్నారం మండల పరిధికి చెందిన రాలకత్వలో వృద్ధులను ఆటోలు తీసుకువెళ్లి ఓట్లు వేసేలా తోడ్పాటు అందించారు. జిల్లాలో ఓటర్ల పసిపిల్లలను వారు ఓటేసి వచ్చే వరకు శ్రద్ధగా పోలీస్ సిబ్బంది చూశారు.

## అమెరికా మమ్మల్ని టాయ్‌లెట్ పేపర్ కన్నా నీచంగా వాడుకుంది

దారుణంగా వాడుకుని వదిలేసిందని వాపోయారు. అమెరికాతో స త్సంబంధాలు పాకిస్తాన్‌ను బలహీనపరిచి అస్థిరంగా మార్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. 1999 తర్వాత అమెరికాతో కలిసి పనిచేయాలని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగించిందని అన్నారు. పాకిస్తాన్ ఎప్పుడూ తమకు సంబంధం లేని యుద్ధాల్లోకి లాగబడిం దని ఆయన బహిరంగంగా అంగీకరిం చారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని అన్నారు. తర్వాత తమను టాయ ్‌లెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని అన్నారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు.1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించు కుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆరోపించారు.ఆఫ్ఘాన్‌పై అమెరికా చేసిన యుద్ధానికి పాక్ మద్దతు ఇవ్వడం ద్వారా తాలిబన్లకు పాకిస్తాన్ వ్యతిరేకంగా మారిందని ఒప్పుకున్నారు. అమెరికా చివరికి ఈ ప్రాంతం నుండి వైదొలగడంతో పాకిస్తాన్ దీర్ఘకాలిక హింస, తీవ్రవాదం, ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని అన్నారు. అమెరికాను సంతృప్తి పరచడానికే పాక్ మాజీ సైనిక పాలకులు జియా-ఉల్-హక్, అమెరికాను సంతృప్తి పరచడానికే పాక్ మాజీ సైనిక పాలకులు జియా-ఉల్-హక్,పర్వేజ్ ముషారఫ్ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో చేరారని పేర్కొన్నారు. మనం ఎదుర్కొన్న నష్టాలను ఎప్పటికీ భర్తీ చేయలేమని.. పాకిస్తాన్ చేసిన తప్పులను తిరిగి మార్చలేనివి అని అన్నారు. ఇటీవల అమెరికాతో పాక్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోంది. అమెరికాకు వ్యతిరేకంగా పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం..

**నోటీసులో లోపాలు..!**


న్యూఢిల్లీ(జనంసాక్షి):లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తొలగించాలంటూ విపక్ష పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు మంగళవారం నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. కాగా ఆ నోటీసుల్లో లోపాలు ఉన్నట్లు లోక్‌సభ వర్గాలు వెల్లడించాయి. కొన్ని సందర్భాలను ప్రతిపక్ష సభ్యులు పదే పదే అందులో ప్రస్తావించినట్లు తెలిపాయి. అయితే.. ఆ నోటీసును పూర్తిగా తిరస్కరించడానికి బదులుగా అందులోని లోపాలను సవరించాలని స్పీకర్ ఓం బిర్లా సెక్రటేరియట్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. సవరించిన నోటీసు అందిన తర్వాత.. నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాటిని పరిశీలిస్తామని అధికారులు పేర్కొన్నారు. మార్చి 9న బడ్జెట్ సెషన్ రెండో దశ ప్రారంభమైన తర్వాత ఈ నోటీసును జాబితా చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు మంగళవారం నోటీసులు అందజేశాయి.



# ప్రజలారా.. క్షమించండి

### నిరసనకారులపై ఉక్కుపాదం మోపడంపై ఇరాన్ అధ్యక్షుడి ఆవేదన


టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తీవ్ర ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆందోళనకారులను అడ్డుకోవడానికి భద్రతా బలగాలు వారిపై ఉక్కుపాదం మోపి, హింసాత్మకంగా అణచివేశాయి. దీనిపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఆ సమయంలో భద్రతా బలగాల అణచివేతలో కుటుంబసభ్యులను కోల్పోయిన, గాయపడిన వారు అనుభ వించిన బాధ తనకు తెలుసని అన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని కట్టడి చేయలేకపోయినందుకు ప్రభుత్వం సిగ్గుపడుతోందన్నారు.అయితే భద్రతా బలగాలు



చేసిన దాడుల్లో అక్కడి నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన పేర్కొనలేదు. పాశ్చాత్య దేశాలు చేసిన తప్పుడు ప్రచారాల వల్ల దేశంలో నిరసనలు చెలరేగుతున్నాయన్నారు. కానీ తమ ప్రభుత్వం ఎప్పటికీ ప్రజలతో ఘర్షణలు, ఇతర దేశాలతో యుద్ధాలు కోరుకోదన్నారు. తాము పెద్ద మొత్తంలో అణ్వాయుధాలు తయారు చేస్తున్నామని ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మసౌద్ పెజెష్కియాన్ పేర్కొన్నారు. శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తిని ఉపయోగించుకునే చట్టబద్ధమైన హక్కులను మాత్రమే కాపాడుకుంటామన్నారు. చర్చలతో అన్ని సమస్యలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అదే సమయంలో అమెరికా చేస్తున్న డిమాండ్లకు ఇరాన్ ఎట్టిపరిస్థితుల్లోనూ లొంగదని స్పష్టం చేశారు.

## కెనడా స్కూల్లో కాల్పులు.. 10 మంది మృతి

ఒట్టావా(జనంసాక్షి):కెనడాలోని ఓ స్కూల్ కాల్పులు కలకలం రేపాయి. బ్రిటిష్ కొలంబియా రాష్ట్రం టుంబ్లర్ రిడ్జ్ సెకండరీ పాఠశాలలో ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా 25 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘాతుకానికి పాల్పడినట్లు భావిస్తున్న వ్యక్తి కూడా తనను తాను గాయపర్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకొంది. సమీపంలోని ఓ ఇంట్లో మరో ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. వీరు కూడా స్కూల్‌లో జరిగిన కాల్పుల ఘటనతో ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని భావిస్తున్నారు. గాయపడిన వారు మరెక్కడైనా ఉన్నారేమోనని తెలుసుకోవడానికి పోలీసులు యత్నాలు మొదలుపెట్టారు. కాల్పుల ఘటనకు సమీపంలోని ఇళ్లల్లో భారీగా తనిఖీలు చేపట్టారు. ఇక షూటర్‌ను ఇప్పటికే దర్యాప్తు బృందాలు గుర్తుపట్టినా.. అతడి వివరాలను మాత్రం వెల్లడించలేదు.



# భూపాలపల్లిలో రూ.లక్ష సీజ్



**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల వేళ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పోలింగ్ కేంద్రం సమీపంలో రూ.లక్ష రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 22వ వార్డులోని పోలింగ్ కేంద్రం సమీపంలోని ఒక బండ కింద డబ్బులు దాచి, ఓటర్లకు పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకుల చేతిలో ఉన్న డబ్బును పోలీసులు సీజ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఈ డబ్బులను పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బుర్రా సదానందాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కాంగ్రెస్ ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పట్టుబడిన సొమ్ముతో తమకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కావాలనే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. నగామలో మున్సిపల్ ఎన్నికలో నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని ఓటర్లు ఆరోపిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు చేయలేదని వాపోతున్నారు. వృద్ధుల కోసం వీల్ చైర్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారిని చేతులపైనే మోసుకెళ్లాల్సి వస్తుంది.

# మారిన గుర్తుల క్రమసంఖ్య

- **ఆందోళన వ్యక్తం చేసిన అభ్యర్థులు**



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో గందరగోళం నెలకొంది. మహబూబ్‌నగర్‌లోని 45వ డివిజన్‌లో ఓటర్లకు ఇస్తున్న బ్యాలెట్ పేపర్లపై సీరియల్ నంబర్లు, గుర్తులు తారుమారు కావడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేసారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధికార యంత్రాంగం ఇచ్చిన బ్యాలెట్ నమూనా ఒకలా ఉంటే.. పోలింగ్ రోజు మరోలా ఇస్తున్నారని వాపోయారు. ముందుగా ఇచ్చిన నమూనా బ్యాలెట్‌లో ముందు ప్రధాన పార్టీల గుర్తులు.. ఆ తర్వాత జనసేన, ఇతర పార్టీల గుర్తులను ఇచ్చారు. కానీ అనూహ్యంగా పోలింగ్ రోజు ఇచ్చిన బ్యాలెట్‌లో జనసేన పార్టీకి ఒకటో నంబర్ ఇచ్చారు. దీంతో ప్రధాన పార్టీల గుర్తులన్నీ మారిపోయాయి. ఎన్నికలు ప్రారంభమయ్యాక ఇది గమనించిన అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. దీంతో 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. అభ్యర్థుల ఆందోళనతో రంగంలోకి దిగిన అధికారులు అభ్యర్థులతో చర్చించారు. సమన్వయంతో ఓటింగ్ పక్రియను పున:ప్రారంభించారు.

# బైక్‌పై తిరుగుతూ మంత్రి వివేక్ ప్రచారం



**మంచిర్యాల, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** రాజ్యాంగ విలువను, ఎన్నికల విధానాలను రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ తుంగలో తొక్కారు. పోలింగ్ జరుగుతున్న బుధవారంసైతం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రచారం చేశారనే విమర్శలు వచ్చాయి. చెన్నూర్ 4, 5 బూత్ లలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభ్యర్థులతో కలిసి బైక్ పై తిరుగుతూ ప్రచారం చేశారు. దాదాపు మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో బైక్ పై తిరుగుతూ ప్రచారం చేస్తూ కెమెరా కంటపడ్డారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిన్న సైతం ఇదే తరహాలో క్యాతన్ పల్లి, చెన్నూరు మున్సిపాలిటీ ల్లో తిరుగుతా మంత్రి ప్రచారం చేశారు. దీంతో రాజ్యాంగం, ఎన్నికల కమిషన్ అంటే గౌరవం లేదా.. విచ్చల విడిగా ఇలా అధికార దుర్వినియోగం చేయడం ఏంటి.. మంత్రి స్థాయి వ్యక్తి ఇలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత జరుగుతున్న అడ్డుకోవాల్సిన ఎన్నికల సంఘం, అధికారుల తీరు పై విమర్శలు వెల్లువెత్తాయి. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని ఓ పోలింగ్ కేంద్రం దగ్గర బీఆర్ఎస్ ఏజెంట్ శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు దౌర్జన్యంగా బయటికి ఈడ్చుకెళ్లారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

**బీఆర్ఎస్ దక్షిణాఫ్రికా ఎన్ఆర్ఐ ప్రెసిడెంట్ నాగరాజు**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న తీరు తీవ్రంగా ఖండించదగినదని బీఆర్ఎస్ దక్షిణాఫ్రికా ఎన్ఆర్ఐ ప్రెసిడెంట్ నాగరాజు అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన తీరును ఆయన తప్పుబట్టారు. ఈ సందర్భంగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలు నుంచి పోలింగ్ వరకు ఎన్నికల నియమావళిని కాంగ్రెస్ బహిరంగంగా ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను బెదిరించడం, భౌతిక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న హీన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు లోనై చట్టాన్ని సైతం పక్కన పెట్టి వ్యవహరించిన కొందరు పోలీసు అధికారుల తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, బెదిరింపులు ఉపయోగించడం ప్రజల తీర్పును ప్రభావితం చేయలేవని, తెలంగాణ ప్రజలు ఎప్పటిలాగే న్యాయం, అభివృద్ధి, సంక్షేమం వైపు నిలబడతారని తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని అభిప్రాయపడ్డారు. అధికార పార్టీ ఆకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జ్‌లు, ప్రతి బీఆర్ఎస్ కుటుంబ సభ్యుడికి దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీపై విశ్వాసం కలిగి ఉండటంతోపాటు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించిన ప్రతి ఓటరుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీతో కలిసి మేము ఎప్పటికీ నిలబడతామని నాగరాజు స్పష్టం చేశారు.

# ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

- **500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు**
- **ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు**
- **ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు**



**హైదరాబాద్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** ఊదరగొట్టే ప్రకటనలు ఇస్తారు. అతి తక్కువ ధరకే ఫ్లాట్స్ ఇస్తామంటూ ఊరిస్తారు. తీరా చూస్తే.. డబ్బులు కట్టించుకుని ఏళ్లకు ఏళ్లు.. వారి చుట్టూ తిప్పించుకుంటారు. డబ్బులు చేతిలో పడ్డాక.. ఉసూరమనిపిస్తారు. అంతా రియల్ మాయాజాలం. ఆ రియల్ మాయకు అమాయకులైన జనం మోసపోతున్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి రియల్ మోసాలు చాలా జరుగుతున్నాయి. తాజాగా అలాంటి చీటింగ్ గ్యాంగ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లిలో వైట్ వాటర్ పేరుతో ఫ్లాట్స్ అమ్ముతున్నామని ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 500 మంది నుంచి 270 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పదేళ్ల నుంచి ప్రాజెక్టు పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ యజమాని అజయ్‌తో పాటు పలువురుపై కేసుల నమోదు చేసి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు మూసాపేట పవర్ నగర్ కాలనీకి చెందిన భోగాడి సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేశారు పోలీసులు. ఐతే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదు. వైట్ వాటర్స్ యాజమాన్యానికి ఫ్లాట్ కొనుగోలు కోసం ఫిర్యాదుదారు సుజాత సుమారు 80 లక్షల రూపాయలు చెల్లించారు. కానీ ఆమె తీసుకున్న ఫ్లాట్‌ను బ్యాంకులో తనఖా పెట్టినట్లు ఆమెకు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరోవైపు వైట్ వాటర్స్ యాజమాన్యం.. ఫ్లాట్ల కొనుగోలుదారులకు ఫ్లాట్లను స్వాధీనం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బు చెల్లించి పదేళ్లు గడిచిపోయిందని బాధితులు చెబుతున్నారు. పైగా ధరలు పెంచడం, ఒకే ఫ్లాట్‌ను పలుమార్లు అమ్మారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో వైట్ వాటర్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వైట్ వాటర్స్ ప్రాజెక్టు వెంచర్‌ను 2018లో ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తయింది. అ, ఆ టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తి చేశారు. ఇ, ఈ టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. ఈ ఏడాది జూన్‌లో అది కూడా ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. గతంలో డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో ఫ్లాట్లు హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి మోసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వైట్ వాటర్స్ యజమాని అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుకున్నారు. ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అతి తక్కువ ధరకే ఫ్లాట్లు ఇస్తామంటూ అందరిని నమ్మించాడు అజయ్. దీంతో ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో వచ్చిన దీనిని ఆకర్షితులై చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పటివరకు 270 కోట్ల రూపాయలకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక్షచి పోలీసులకి ఇప్పటివరకు వందమంది కాంటాక్ట్ అయ్యారు. మరోవైపు పోలీస్ కేసు నుంచి తప్పించుకునేందుకు అజయ్ కొత్త నాటకానికి తెర తీసినట్టు బాధితులు చెబుతున్నారు. తమకు డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి.. కొందరి చేత కేసులు విత్ డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ విభజన సరైనదే

- **స్వాగతించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్**



**హైదరాబాద్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ని తెలంగాణ ప్రభుత్వం మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించింది. హైదరాబాద్‌ను మూడు డివిజన్లుగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. 'గ్రేటర్ హైదరాబాద్ ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం ద్వారా నగరానికి మంచి జరగబోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా.. ఇది ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయం కాదు. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, విపక్షాల అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రాంతీయ కార్యాలయంలో నేరుగా సమస్యలు పరిష్కారం అవుతాయి. బీఆర్ఎస్ రాజకీయం కోసం మాట్లాడుతున్నారు. వాళ్లు అధికారంలో ఉన్న రోజుల్లో ఏమీ పట్టించుకోలేదు. రాజకీయాల కోసం ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వేగవంతమైన అభివృద్ధికి ఈ నిర్ణయం గొప్ప ఊతమిస్తుంది. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మక నిర్ణయం.. దీన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా' అని అన్నారు.

# వేములవాడలో ఓటేసిన ఎన్నారై

**వేములవాడ, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని చెబుతున్న కొందరు గడప దాటని విధానం ఇంకా కొనసాగుతూనే ఉంది. వేములవాడ పురపాలక సంఘం ఎన్నికల్లో మాత్రం ఏకంగా వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి అమెరికా నుండి వచ్చి ఒకరు పురపాలక సంఘం ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం సర్వత్రా హర్ష వ్యక్తమవుతోంది. అమెరికాలో ఉద్యోగంలో స్థిరపడిన కార్తికేయ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేములవాడకు వచ్చి 28వ వార్డులో తన ఓటు వినియోగించుకున్నారు. యువతకు ఆయన ఓటుకున్న విలువను గురించి తెలియజేసినట్లుగా స్థానికులు తెలిపారు.

# సైబరాబాద్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

- **ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్ రమేశ్**



**హైదరాబాద్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తు, తీరును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల లోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సైబరాబాద్ సీపీ వెంట డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డిసిపి సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# హైవే పక్కన సూట్‌కేస్ యువతి మృతదేహం



**చండీగఢ్ (జనంసాక్షి) :** హైవే పక్కన సూట్‌కేస్ పడి ఉండటాన్ని కొందరు వ్యక్తులు గమనించారు. అందులో సగం కాలిన యువతి మృతదేహం ఉండటం చూసి షాక్ అయ్యారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. పంజాబ్‌లోని బతిండా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం బెహ్మన్ దివానా గ్రామం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఎర్రటి సూట్‌కేస్ పడి ఉన్నది. పొలాల్లో పనిచేస్తున్న వ్యక్తులు దీనిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ సూట్‌కేస్‌లో సగం కాలిన యువతి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. ఫోరెన్సిక్ బృందంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. మరోవైపు మహిళ శరీరంపై గాయాల గుర్తులు ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. హతురాలి వయస్సు 20 ఏళ్లు ఉంటాయని అంచనా వేశారు. ఆ మహిళ వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆమె హత్యపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# నరవణెళి పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుందే నరవణెళి రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం విడుదలకు ముందే సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతుండటం వివాదాస్పదమవుతోంది. దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు తాజాగా పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియాకు నోటీసులు పంపారు. ప్రచురితం కాని పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలు సంధిస్తూ వాటికి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

నరవణెళి పుస్తకం చుట్టూ నెలకొన్న వివాదంపై పెంగ్విన్ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు సామాజిక మాధ్యమాల్లో వివరణ ఇచ్చింది. ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని తొలుత పేర్కొంది. విడుదల కాబోతోన్న పుస్తకం, ప్రీ ఆర్డర్‌కు అందుబాటులో ఉన్న పుస్తకం, పబ్లిష్డ్ పుస్తకం ఒకటి కాదని మార్కెట్లో అన్ని చోట్ల అందుబాటులోకి వచ్చినప్పుడే పబ్లిష్డ్‌గా పరిగణించాలని రెండోసారి వివరణలో పేర్కొంది. నరవణెళి పుస్తకానికి సంబంధించి వచ్చిన ఒక ఆర్టికల్‌ను రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రస్తావించడం వివాదానికి కారణమైంది. రాహుల్ చర్చలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోక్యం చేసుకుంటూ ఇంకా విడుదల కాని పుస్తకం గురించి ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. పుస్తకానికి రక్షణ శాఖ అనుమతి అవసరం. అయితే అనుమతి ఇవ్వలేదని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ గత వారం ఆ పుస్తకాన్ని పార్లమెంటు వెలుపల ప్రదర్శించడంతో వివాదం ముదిరింది. అయితే పెంగ్విన్ సంస్థ ఇచ్చి ప్రకటనను నరవణెళి సమర్థించారు. 'ఇదే ఆ పుస్తకం స్థితి' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పెంగ్విన్ ప్రకటనను దాంతో షేర్ చేశారు.

# బోధన్‌లో దొంగ ఓట్లేసేందుకు యత్నం

- **ఇద్దరిని గుర్తించి పట్టుకున్న పోలీసులు**

**నిజామాబాద్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అక్కడక్కడా కొందరు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చి పట్టుబడ్డారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం రాకసిపేట గోశాలలో దొంగ ఓట్లు వేసేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. బూత్ నెంబర్ 24, 78 లలో ఇతరుల పేరుతో ఓటు వేసేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. తప్పుడు గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీనితో బోధన్ పట్టణం 21వ వార్డు పరిధిలోని అరీసా సాగర్ నగర్ లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకే చోట బీఆర్ఎస్, ఓఎఓ రెండు పార్టీల కార్యకర్తలు గుమ్మిగూడారు. ఒక్కసారిగా పరస్పర నినాదాలు చేపట్టారు. దాంతో ఆ ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఒకే చోట బిఆర్ఎస్, ఎంఐఎం కార్యకర్తలు గుమిగూడి పరస్పర నినాదాలు చేశారు. దీనితో ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు.



# “న్యాయం ఆలస్యం అయితే అది అన్యాయమే.”



ఇరవై రూపాయల లంచం కేసులో ఇరవై తొమ్మిది సంవత్సరాల తర్వాత నిర్దోషిగా తేలిన ఓ మాజీ కానిస్టేబుల్ ఆనందంతో అదే రోజు మరణించడం కేవలం ఒక వ్యక్తిగత విషాదం కాదు; అది భారత న్యాయ వ్యవస్థలోని లోతైన విరుద్ధతలకు ప్రతీక. తీర్పు వచ్చిన రోజే జీవితం ముగిసిపోవడం అనేది “న్యాయం దొరికింది” అనే వాక్యాన్ని ప్రశ్నార్థకం చేస్తుంది. ఆలస్యంగా వచ్చిన న్యాయం, జీవితకాల శిక్షకు సమానమవుతుంది.

**జైళ్లలో నిరీక్షిస్తున్న నిర్దోషులు:**
నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2022 గణాంకాల ప్రకారం భారత జైళ్లలో సుమారు 75 శాతం మంది ఖైదీలు “అండర్ ట్రయల్”లు అంటే కేసు విచారణ పూర్తికాకముందే నిర్బంధంలో ఉన్నవారు. మొత్తం ఖైదీల సంఖ్య సుమారు 5.7 లక్షలు. వీరిలో వేలాది మంది సంవత్సరాల తరబడి బెయిల్ లేకుండా లేదా విచారణ ఆలస్యంతో జైళ్లలోనే మగ్గుతున్నారు. సుప్రీంకోర్టు పలుమార్లు “బెయిల్ ఈజ్ ది రూల్, జైల్ ఈజ్ ది ఎక్సెప్షన్” అని స్పష్టం చేసింది. అయినప్పటికీ కఠిన చట్టాల కింద నమోదైన కేసుల్లో బెయిల్ దొరకడం అరుదుగా మారింది.

**కఠిన చట్టాలు -అంతకంటే కఠిన వాస్తవాలు:**
అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ (యూఏపీఏ), నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్.ఎస్.ఏ.), పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ వంటి చట్టాలు తీవ్రవాద నిరోధక చట్టాలుగా రూపొందించబడ్డాయి. కానీ లా జర్నల్స్‌లో, ముఖ్యంగా “ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ”, “ఇండియన్ లా రివ్యూ” వంటి పత్రికల్లో వచ్చిన విశ్లేషణల ప్రకారం, ఈ చట్టాల కింద నమోదైన కేసుల్లో శిక్ష శాతం చాలా తక్కువగా ఉంది.
ఉదాహరణకు,(ఎన్.సీ.ఆర్.బీ) గణాంకాల ప్రకారం “ఊపా” కేసుల్లో దోషి నిర్ధారణ శాతం 2 నుండి 5 శాతం మధ్యే ఉంది. అంటే అరెస్టయిన వారిలో మెజారిటీ చివరికి నిర్దోషులుగానే విడుదలవుతున్నారు. కానీ అప్పటికి వారు జైలులో గడిపిన సంవత్సరాలు తిరిగి రావు.

**ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా కేసు:**
100 శాతం వికలాంగుడైన ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆయనపై తీవ్రవాద అనుబంధాల ఆరోపణలు నమోదయ్యాయి. ఆరోగ్య పరిస్థితి దయనీయంగా ఉన్నప్పటికీ దీర్ఘకాలం జైలులో ఉంచడం మానవ హక్కుల సంస్థల ఆందోళనకు దారితీసింది. అనంతరం ఉన్నత న్యాయస్థానాలు ఆధారాల లేమిని ప్రస్తావిస్తూ ఆయనను విడుదల చేశాయి. అయితే అప్పటికే ఆయన ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది; కుటుంబం ఆర్థిక, మానసికంగా కృంగిపోయింది. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే: చివరికి నిర్దోషిగా తేలితే, ఆ సంవత్సరాల నష్టం ఎవరు భర్తీ చేస్తారు?

**మరిన్ని ఉదాహరణలు:**

**స్టాన్ స్వామి కేసు:**
84 ఏళ్ల జెస్యూట్ పాద్రి స్టాన్ స్వామి, భీమా కొరేగావ్ కేసులో అరెస్టయ్యారు. ఆరోగ్యం బలహీనంగా ఉన్నప్పటికీ బెయిల్ దొరకకపోవడం, జైలులోనే మరణించడం అంతర్జాతీయ మానవ హక్కుల వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీసింది.

**సిద్దీక్ కప్పన్ కేసు:**
కేరళకు చెందిన జర్నలిస్ట్ ఉత్తరప్రదేశ్‌లో అరెస్టై రెండు సంవత్సరాలకు పైగా నిర్బంధంలో ఉన్నారు. తరువాత సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

**ఖలిద్ సైఫీ, ఉమర్ ఖాలిద్ వంటి విద్యార్థి నేతలు:**
ఢిల్లీ అల్లర్ల కేసుల్లో దీర్ఘకాలంగా నిర్బంధంలో ఉన్నారు. విచారణ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఈ కేసులు న్యాయ ప్రక్రియలో జాప్యం, కఠిన చట్టాల వినియోగం, బెయిల్ విధానాలపై ప్రశ్నలను లేవనెత్తాయి.

**బాధ్యత ఎవరిది?**
పోలీసులు కేసు నమోదు చేసే సమయంలో హేతుబద్ధమైన ఆధారాలు సమర్పించాల్సిన బాధ్యత ఉంది. మెజిస్ట్రేట్ మొదటి రిమాండ్ సమయంలో కేసు పత్రాలను పరిశీలించి వ్యక్తిగత స్వేచ్ఛను రక్షించాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత కలిగి ఉంటారు. అయినప్పటికీ “రిమాండ్ అనేది రొటీన్ ప్రక్రియ”గా మారిపోయిందనే విమర్శలు “లా” పండితుల నుండి వినిపిస్తున్నాయి.
సుప్రీంకోర్టు “హుస్సేన్ ఆరా ఖతూన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్” కేసులో వేగవంతమైన విచారణ హక్కు రాజ్యాంగ హక్కు అని స్పష్టం చేసింది. అయినప్పటికీ నేటికీ వేలాది మంది విచారణ లేకుండా జైళ్లలో ఉన్నారు.

**పరిహారం మరియు సంస్కరణ**
కొన్ని సందర్భాల్లో కోర్టులు నిర్దోషులైన వ్యక్తులకు పరిహారం ఆదేశించాయి. కానీ అది వ్యవస్థాత్మక పరిష్కారం కాదు. భారతదేశంలో “రాంగ్‌ఫుల్ ప్రాసిక్యూషన్”కు స్పష్టమైన చట్టబద్ధ పరిహార వ్యవస్థ లేదు. లా కమిషన్ 277వ నివేదికలో నిర్దోషులైన వ్యక్తులకు పరిహారం చట్టం అవసరమని సూచించింది.

**వ్యవస్థలో లోపాలు:**
కేసుల పెండెన్సీ – దేశవ్యాప్తంగా 5 కోట్లకు పైగా పెండింగ్ కేసులు.జడ్జీల కొరత–లక్ష జనాభాకు తగినంత న్యాయ మూర్తులు లేరు. పోలీసు దర్యాప్తు నైపుణ్య లోపం.ఫోరెన్సిక్ మౌలిక వసతుల కొరత.రాజకీయ కక్షతో కఠిన చట్టాల విస్తృత ప్రయోగం.

**మానవ కోణం:**
జైలు అనేది కేవలం గోడల మధ్య బంధనం కాదు; అది కుటుంబాల విరహం, ఆర్థిక పతనం, సామాజిక అవమానం. ఒకసారి “తీవ్రవాది”, “దేశద్రోహి” అనే ముద్ర పడితే తరువాత నిర్దోషిగా తేలినా ఆ ముద్ర పూర్తిగా తొలగదు.
ఆ మాజీ కానిస్టేబుల్ కథలో ఆనందంతో మరణం ఒక ప్రతీక. అది న్యాయం ఆలస్యమైతే అది న్యాయం కాదనే వాస్తవానికి ప్రతిధ్వని.
చివరిగా...ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, పోలీసులు, న్యాయస్థానాలు అన్నీ రాజ్యాంగ పరిమితుల్లో పనిచేయాలి. కఠిన చట్టాలు అవసరమయ్యే సందర్భాలు ఉంటాయి. కానీ అవి అసాధారణ పరిస్థితులకే పరిమితం కావాలి. వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ హృదయం.
నిర్దోషులైన వ్యక్తి జీవితంలోని పది సంవత్సరాలు తిరిగి ఇవ్వలేం. అందుకే దర్యాప్తు దశలోనే జాగ్రత్త, రిమాండ్ దశలోనే విజ్ఞత, విచారణ దశలో వేగం అవసరం. లేనిపక్షంలో “తీర్పు వచ్చింది” అనేది కేవలం చట్టపరమైన వాక్యం మాత్రమే; జీవితపరంగా అది శూన్యం. న్యాయం అంటే కేవలం శిక్ష విధించడం కాదు. నిర్దోషిని రక్షించడం కూడా అదే స్థాయిలో పవిత్ర బాధ్యత. భారత న్యాయవ్యవస్థ ఆ రెండింటి మధ్య సమతుల్యత సాధించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

---

## స్వేచ్ఛలు! స్వాతంత్రాలు!!



అది స్వేచ్ఛా వాయువు
ఎవరైనా సరే ఏదైనా సరే
ఏమి చేసినా ఎంత చేసినా
నలుగురికి కష్టం కలగనంతవరకు
సమాజానికి కీడు జరగనంతవరకు
తప్పుడు దారులకు
ప్రేరేపించనంతవరకు
ఏ రకమైన కష్టం లేదు
ఏ విధమైన నష్టం లేదు
వ్యక్తిగత స్వేచ్ఛలు వేరు
ప్రాథమిక స్వేచ్ఛలు వేరు
ఎలాంటి స్వేచ్ఛకైనా కొన్ని హద్దులు
కొన్ని పరిమితులు నియమాలు
స్వాతంత్రానికి మాత్రమే..
ఇవేవి వర్తించవు!
కారణం స్వాతంత్రం..
భూగర్భ పునాదుల నుండి పుట్టినది
విశ్వవ్యాప్తంగా ఆమోదం పొందినది
ఎప్పటికి ఎవరికి హాని చేయనిది
అందుకే అన్ని స్వేచ్ఛలు..
స్వాతంత్రాలు కాదు!
కాని అన్ని స్వాతంత్రాలు..
ముమ్మాటికీ స్వేచ్ఛలే!!

**కోటం త్రిశూల్**
8523005678

---



**పారిపోలేని భూమిని**
**ఎగిరిపోలేని కొండను**
**అమ్మకానికి అనుయాయులకే**
**అప్పజెపుతావెందుకు ?**
**జనహితమెరుగని నాయక**
**విధ్వంసక విశ్వ నరుడివి**
**అపరాధికి పట్టిన గొడుగువి**
**చూడ మేడి పండువి**
**పరధ్యాన ప్రభువువి .**

## ఔదార్య లోపం

**కాసింత నేలను కోరుకుని**
**కదలక నిలుచున్న చెట్టును**
**నీడనిచ్చి గాలినిచ్చే మానును**
**చినుకునిచ్చే తరువును**
**చిటికెడు ప్రేమనివ్వక కూల్చి**
**వేస్తావెందుకు ?**




**మండాది గోపీనాథ్**
ముక్కుడు దేవులపల్లి
సెల్ – 98850 45344

---

## అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం

సవాళ్ల నుంచి మార్పు దిశగా... ఆశను నింపుతున్న వైద్య విజ్ఞానం
ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవంను నిర్వహిస్తారు. ఈ రోజు పిల్లలు ఎదుర్కొనే కష్టాలను మాత్రమే కాదు, ఆధునిక వైద్య విజ్ఞానం వల్ల బాల్య క్యాన్సర్ చికిత్సలో వచ్చిన ఆశాజనకమైన మార్పును కూడా గుర్తు చేస్తుంది. ఒకప్పుడు భయంతో కూడిన వ్యాధిగా భావించిన క్యాన్సర్, నేడు అనేక మంది పిల్లలకు జీవితం మళ్లీ ఇచ్చే వ్యాధిగా మారుతోంది.



**బాల్య క్యాన్సర్ అంటే ఏమిటి?**
“క్యాన్సర్” అనే పదం వినగానే తల్లిదండ్రుల గుండెల్లో భయం మొదలవుతుంది. అయితే బాల్య క్యాన్సర్ అరుదైనది మరియు పెద్దల క్యాన్సర్లకు పూర్తిగా భిన్నమైనది. భారతదేశంలో ప్రతి సంవత్సరం ప్రతి లక్ష మంది పిల్లల్లో సుమారు 12–15 మందికి క్యాన్సర్ నిర్ధారణ అవుతుంది. వీటిలో రక్త క్యాన్సర్లు (లూకేమియా, లింఫోమా), మెదడు కణితులు, ఇతర అవయవాలకు సంబంధించిన కణితులు ఉంటాయి. ముఖ్యంగా తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే–అపోహలను తొలగిద్దాం
బాల్య క్యాన్సర్ తల్లిదండ్రుల తప్పిదాల వల్ల కాదు.. ఆహారం, జీవనశైలి లేదా శాపం వల్ల కూడా కాదు.. అంటువ్యాధి ఏ మాత్రం కాదు.
పిల్లలు ఎదుగుతున్న సమయంలో కణాల్లో జరిగే అనుకోని మార్పుల వల్ల ఈ వ్యాధి ఏర్పడుతుంది. సరైన సమయంలో చికిత్స మొదలుపెడితే పిల్లలు పూర్తిగా నయం అయి సాధారణ జీవితం గడపగలరు. భయం నుంచి ఆశ వైపు... జీవితం తిరిగి మొదలవుతుంది కొన్ని దశాబ్దాల క్రితం బాల్య క్యాన్సర్ అంటే నిరాశగా భావించేవారు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. ఆధునిక చికిత్సల వల్ల 80–85 శాతం మంది పిల్లలు పూర్తిగా నయం అవుతున్నారు. కొన్ని క్యాన్సర్లలో ఈ శాతం 90కి పైగా ఉంది. మన చుట్టూ క్యాన్సర్‌ను జయించిన పిల్లలు ఉన్నారు. వారు మళ్లీ పాఠశాలలకు వెళ్తున్నారు, క్రీడల్లో పాల్గొంటున్నారు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు, ఉద్యోగాలు చేస్తున్నారు, కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. బాల్య క్యాన్సర్ ఇక మరణశిక్ష కాదు – ఆశతో ముగిసే ఒక పోరాటం.

**ఆధునిక చికిత్సా విధానాలు**
నేటి బాల్య క్యాన్సర్ చికిత్స సంప్రదాయ పద్ధతులు మరియు అత్యాధునిక సాంకేతికతల సమ్మేళనం. కీమోథెరపీ, శస్త్రచికిత్స, రేడియేషన్, ఎముక గుజ్జ మార్పిడి (బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్) ఇప్పటికీ అనేక ప్రాణాలను రక్షిస్తున్నాయి. వీటితో పాటు ఇప్పుడు అందుబాటులో ఉన్న కొత్త చికిత్సలు:

- CAR-T సెల్ థెరపీ – పిల్లల స్వంత రోగనిరోధక కణాలతోనే క్యాన్సర్‌ను ఎదుర్కొనే విధానం
- టార్గెటెడ్ థెరపీ – క్యాన్సర్ కణాలనే లక్ష్యంగా చేసుకుని పనిచేసే మందులు
- ఇమ్యూనోథెరపీ – శరీర రక్షణ వ్యవస్థను బలపరిచే ఆధునిక చికిత్స

ఈ అన్ని చికిత్సలు ఇప్పుడు హైదరాబాద్ సహా భారతదేశంలోని అనేక కేంద్రాల్లో అందుబాటులో ఉండటం ఎంతో ఆశాజనకం.
త్వరిత నిర్ధారణే కీలకం
బాల్య క్యాన్సర్‌ను నయం చేయడంలో త్వరగా గుర్తించడం అత్యంత ముఖ్యం. పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి:

- దీర్ఘకాలం తగ్గని జ్వరం
- శరీరంలో ఎక్కడైనా అసాధారణ వాపులు లేదా గడ్డలు
- కారణం లేని బరువు తగ్గడం, తీవ్రమైన అలసట
- ఎముకలు లేదా కీళ్ల నొప్పులు
- తరచుగా గాయాలు, రక్తస్రావం
- చూపు సమస్యలు, ఉదయం తీవ్రమైన తలనొప్పి, వాంతులు

ప్రతి జ్వరమూ క్యాన్సర్ కాదు. కానీ లక్షణాలు కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు.

**చికిత్సకు మించి - పోషణ, సంరక్షణ**
మందులతో పాటు మంచి పోషణ, ఇన్ఫెక్షన్ నివారణ, నొప్పి నియంత్రణ, మానసిక సహాయం కూడా చికిత్సలో కీలక పాత్ర పోషిస్తాయి. సరైన ఆహారం తీసుకునే పిల్లలు చికిత్సను బాగా తట్టుకుంటారు, త్వరగా కోలుకుంటారు. చికిత్స పూర్తయ్యాక కూడా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, టీకాలు, ఆరోగ్యకర జీవనశైలి ఎంతో అవసరం.
సవాళ్ల నుంచి మార్పు దిశగా ఈ అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం మనకు చెప్పే సందేశం ఒక్కటే క్యాన్సర్ ఒక సవాలు మాత్రమే, అంతం కాదు. అవగాహన, త్వరిత నిర్ధారణ, ఆధునిక చికిత్స, మంచి పోషణ మరియు ప్రేమతో కూడిన సంరక్షణతో మరిన్ని పిల్లల జీవితాలను కాపాడగలం. ప్రతి నయం అయిన పిల్లాడు ఒక కుటుంబానికి విజయం, సమాజానికి గర్వకారణం.

**డా. వర్షిణి బండి**
కన్సల్టెంట్ పిల్లల రక్త, క్యాన్సర్ వైద్యురాలు, బీఎంటీ స్పెషలిస్ట్
అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్, నల్లగండ్ల, హైదరాబాద్

---

## మళ్లీ మొదటికే.. సాదాబైనామాల సమస్య.!?






**సాదాబైనామాల సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లు కనిపిస్తున్నది. గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిష్కరించలేక పోయింది. మేం అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చి...అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు నిబంధనల పేరిట రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. లక్షలాది మంది రైతుల ఆందోళనకు కారణమయింది. కోర్టు మెట్లెక్కేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని భూ సమస్యల పరిష్కారం నిపుణులు అంటున్నారు. ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలని భూభారతి రూపకల్పనలో పాల్గొన్న భూమి సునీల్ కూడా సూచిస్తున్నారు. అసలు సాదాబైనామాల కథేంటో... రైతుల వ్యథేంటో తెలుసుకుందాం..**

తెల్ల కాగితాలపై చిన్న, సన్న కారు రైతుల వ్యవసాయ భూముల క్రయ విక్రయాలు గతంలో జరిగేవి. రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం భరించలేని వారంతా సాదాబైనామాలతో సరిపెట్టుకునేవారు. తెలంగాణలో దశాబ్దాల తరబడి ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇలాంటి కొనుగోళ్లకు తహసిల్దార్ లు జమాబంది చేసినప్పుడు పట్టా మార్పిడి గురించి రికార్డుల్లో రాసేవారు. 1989లో అమలులోకి వచ్చిన రికార్డ్స్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్) 1971 చట్టం ప్రకారం రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉంటేనే పాసు పుస్తకం ఇచ్చేవారు. ఈ చట్టానికి 1989లో చట్టసవరణ చేసి సెక్షన్ 5 తీసుకురావడంతో సాదాబైనామాల ద్వారా భూమిని కొంటే... తహసిల్దార్ కు దరఖాస్తు చేస్తే చాలు పట్టాలు ఇచ్చే అవకాశం కల్పించింది అప్పటి ప్రభుత్వం. తరవాత ఇలా పట్టాలు ఇచ్చారు. మొత్తం 13సార్లు పట్టాలిచ్చారు. చివరి సారిగా 2016లో అప్పటి సిఎం కేసిఆర్ సాదాబైనామాలను క్రమబద్ధీకరించి పట్టాలిచ్చారు.

**కేసిఆర్ పరిష్కరించింది ఇలా...**
సాదాబైనామాలు అధికారికం కాకపోవటంతో వీటికి రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఫలితంగా బ్యాంకుల్లో వీరికి రుణాలు కూడా అందటం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరవాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను జారీ చేసింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు.మొత్తం 12.64 లక్షల దరఖాస్తులు రాగా వాటిలో 6.18 లక్షల మందికి భూమి హక్కులు కల్పించారు.
అయితే కొత్త పట్టాదార్ పాసు పుస్తకాల కోసం 2020 అక్టోబరు 12 న 112 జీఓను జారీ చేశారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసినప్పటికీ సాదాబైనామాల ప్రక్రియ ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో సాదాబైనామాలతో పాటు అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి ధరణిలో ఏలాంటి మార్గాలను చూపించలేదు. దీంతో పాటు గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేయటంతో రైతుల కష్టాలు మరింతా పెరిగాయి. సాదాబైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో జీవో నెంబరు 112ద్వారా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ నిర్మల్‌కు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు జీవో అమలును నిలిపివేస్తూ 2020 నవంబరు 11న మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఆగిపోయింది.

**ఇపుడు సమస్య వచ్చాందిలా..**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సాదాబైనామాల సమస్యను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలుమార్లు హామీ ఇచ్చారు. న్యాయపరమైన చిక్కులను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీనికి తోడు, ఇటీవల హైకోర్టు కూడా రైతులకు 13–బీ ప్రొసీడింగ్స్ జారీ చేయడానికి అనుమతించింది. ప్రభుత్వం భూభారతిలో సెక్షన్ 6ను చేర్చి సాదాబైనామాలను ప్రస్తావించారు. దీంతో సెక్షన్ 6(1) ప్రకారం సాదాబైనామాలను క్రమబద్ధీకరించవచ్చని పేర్కొంది. దీంతో కోర్టు స్టేనే ఎత్తివేసింది. రైతుల ఆశలు చిగురించాయి.
సాదాబైనామాల క్రమబద్ధీకరణకు కాంగ్రెస్ సర్కార్ జీఓ జారీచేసింది. కటాఫ్ డేట్ ను మార్చలేదు కానీ, ఆ తేదీ నాటికి వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన చిన్న, సన్నకారు రైతులు 12 ఏళ్లకు పైగా పొజిషన్ లో ఉండాలనే నిబంధన చేర్చింది. 2020 అక్టోబర్ 12 నుండి నవంబర్ 10 మధ్యలో దరఖాస్తు చేసుకని ఉండాలని కండీషన్ పెట్టారు. ఈ దరఖాస్తులను విచారించే అధికారాన్ని ఆర్డీఓలకు కట్టబెట్టింది ప్రభుత్వం. విచారణ అనంతరం ఆర్డీఓలు నోటీసులు జారీ చేసి సర్టిఫికెట్లను ఇస్తారు. దీని ఆధారంగా రైతులు పట్టాదారు పాసుపుస్తకాలను పొందే అవకాశం కలుగుతుంది.
ఈ ప్రక్రియ పూర్తయితే, ఏళ్ల తరబడి హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్న 9 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ అవుతాయి. దీనివల్ల వారికి రైతుబంధు, పంట రుణాలు వంటి ప్రభుత్వ పథకాలు అందడమే కాకుండా, రిజిస్ట్రేషన్లు–మ్యుటేషన్ల ద్వారా ప్రభుత్వానికి కూడా భారీగా ఆదాయం సమకూరనుంది.
అయితే సాదాబైనామాలను పరిష్కరించి 13బి సర్టిఫికెట్ ఇచ్చేప్పుడు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు ఎంత ఉంటే ప్రభుత్వానికి అంత చెల్లించాలని , ఆర్డీల విచారణ సందర్భంగా కొన్న వ్యక్తితో పాటు అమ్మిన వ్యక్తి కూడా అఫిడవిట్ ఇవ్వాలని నిబంధన పెట్టారు. ఈ నిబంధన సన్న, చిన్నకారు రైతులకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. గత ప్రభుత్వం తీసుకున్న దరఖాస్తులను పరిష్కరించక పోగా..కోర్టుల చుట్టూ తిరిగేలా చేస్తున్నది అని రైతులు విమర్శించే అవకాశం ఉందని భూ నిపుణులు కాంగ్రెస్ సర్కార్ ను హెచ్చరిస్తున్నారు.
వాస్తవానికి అమ్మిన వ్యక్తి సమ్మతి నిబంధన వైఎస్ రాజశేఖర్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడే తొలగించారు. ఎప్పుడో అమ్మిన వ్యక్తి ఇప్పుడు అంగీకరించే అవకాశం లేదు. చుట్టుపక్కల భూముల రైతులను విచారించడం, గ్రామ పెద్దల స్టేట్‌మెంట్ ఆధారంగా క్రమబద్ధీకరించే అవకాశం కల్పించారు. దీనికి తోడు పహణిలో సాగుదారు కాలంలో ఉన్న కొన్నవ్యక్తి పేరు పరిగణనలోకి తీసుకునేవారు. 2009–16 వరకూ సాదాబైనామాలను ఇలాగే క్రమబద్ధీకరించారు. సాదాబైనామాలను 2020లో దాదాపు 4 లక్షల దరఖాస్తులను అప్పుడే నిర్ణయం తీసుకున్నారు. అప్పటి ధరణిలో సాదా బైనామాల అంశం లేనప్పటికీ కేసిఆర్ నిర్ణయం తీసుకున్నారు. అయితే వీటిలో చాలా మటుకు రిజెక్ట్ చేశారనే విమర్శలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దు చేసి తీసుకువచ్చిన భూ భారతిలో తిరస్కరించిన దరఖాస్తుల సంగతేంటో లేదు. వాటిని ఆమోదించాలా...తిరస్కరించాలా...అనే విషయం స్పష్టంగా లేక పోవడంతో మొత్తం దరఖాస్తులను పరిశిలించడం మేలనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. విక్రయదారులు చాలా మంది చనిపోయారు. బతికి ఉన్న వారు కొన్న వారికి అఫిడవిట్ లు ఇవ్వడం లేదు. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. అసలు చట్టాలు, నిబంధనలు పాటిస్తూ పోతే సాదా బైనామాలను క్రమబద్ధీకరించడం సాధ్యం కాదని, కొందరు రైతులు కోర్టుకు పోతే.... ఈ ప్రక్రియ మళ్లీ మొదటికి వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు మరువరాదు.




**వంగ మహేందర్ రెడ్డి**
సీనియర్ జర్నలిస్ట్

---

## ప్రజల మనిషి బండారు రాజిరెడ్డి

**ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర**



బండారు రాజిరెడ్డి 1947 ఫిబ్రవరి 12న జన్మించారు ఉప్పల్ నియోజక వర్గానికి తొలి ఎమ్మెల్యే తాను విద్యార్థి దశ నుండి తుది శ్వాస విడిచే అంతవరకు నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడిన మహనీయుడు గొప్ప మానవతావాది నికర్షణ మనిషి ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే ముక్కుసూటి మనిషి ఆయన చూపించిన ధైర్యం బండారు రాజిరెడ్డి నాయకత్వం విధానాల్లోనే కాదు వ్యక్తిగత ప్రవర్తన లోను కనిపిస్తుంది ఆయన నమ్ముకున్న కార్యకర్తలకు కూడా మంచి చేసినాడు దివంగత మహనేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నమ్మిన బంటుగా ఉన్నాడు ఉప్పల్ తొలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది ఇక్కడి నుండే మొట్టమొదటిసారిగా బండరు రాజిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంలో ఆయన కనబరిచిన ప్రతిభ ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు ఎప్పుడు మర్చిపోలేరు కోట్లాది రూపాయలు నిధులు తెచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉన్నారు ఆయన భౌతికంగా లేకున్నా ఆయనను స్మరించడం అంటే ఆయన చేసిన మంచి పనులే నిబద్ధతకు హుందాతనానికి మంచి పేరుకు ఆయనే నిదర్శనం బండారు రాజిరెడ్డి ఐదుగురు అన్నదమ్ములు బండారు లక్ష్మారెడ్డి ప్రస్తుతం ఉప్పల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు ఏనాడు కూడా తన వ్యక్తిగత స్వార్థం గురించి ఆలోచించలేదు ఆయన పదిమంది గురించి ఆలోచించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు ఎంతోమంది ఎమ్మెల్యేలు అవుతారు పోతారు కానీ బండారు రాజిరెడ్డి మాత్రం ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు ఉప్పల్ నియోజకవర్గంలో మురికివాడలను ఎంపిక చేసి మురికివాడల అభివృద్ధికై ఎనలేని కృషిని చేసినాడు సాయిరాం నగర్ కాలనీలో నీటి కొరత అత్యధికంగా ఉండేది మందిర పైప్లైన్ ద్వారా త్రాగునీరు అందించి ప్రజల దాహార్తిని తీర్చగలిగారు రాజీవ్ నగర్ కైలాసగిరి నవోదయ నగర్ కాలనీల అభివృద్ధికి బాటలు వేశారు కైలాసగిరిలో శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తన సొంత నిధులతో కట్టించి ధర్మాన్ని రక్షించాడు ఇక్కడే అయ్యప్ప స్వాములు మాలలు వేసుకొని బిక్ష కూడా చేస్తుంటారు ఎంతోమందికి ఉపాధిని కల్పించారు సహాయ సహకారాలు అందించి ప్రజలకు నేనున్నానని భరోసాను కల్పించారు బండారు రాజిరెడ్డి ఏది మాట్లాడిన ఏదైనా హామీ ఇస్తే అది అమలయంత వరకు దానికి ఫాలో అయ్యేవాడు ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దగ్గరికి వస్తే తక్షణమే స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మార్గాన్ని చురగొన్నారు గత టిడిపి హాయంలో ఎన్నో కుట్ర కేసులు పెట్టినప్పటికీ ఆ కేసులను ఎదురుకొని న్యాయస్థానాలలో పోరాడుతూనే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడంలో బండారు రాజిరెడ్డి పాత్ర మర్చిపోలేనిది అనివర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు ప్రయాణించినాడు రాజకీయ జీవితంలో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు కొనసాగాడు కాప్రా మున్సిపాలిటీ కి తొలి చైర్మన్ కూడా ఆయనే రైతాంగ సమస్యలపై విద్యార్థుల సమస్యలపై కార్మికుల సమస్యలపై ప్రజా సమస్యలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన కళాని వినిపించాడు ఎప్పుడు ప్రజల మధ్యలో ఉంటూనే ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజానేతగా ఎదిగాడు బండారు రాజిరెడ్డి బాటలోనే తమ్ముడు బండారు లక్ష్మారెడ్డి రాజకీయాలలో కొనసాగు తున్నాడు ఉప్పల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయినాడు ఇల్లు లేని నిరుపేదలకు రాజీవ్ గృహకల్ప ద్వారా నివాసాలను అందించారు రేషన్ కార్డులు లేనివారికి రేషన్ కార్డులు అందించడం వైద్యం చేయించుకో లేనటువంటి పేదలకు వైద్య సేవలు అందించడం కుషాయిగూడ జమ్మిగడ్డలో ప్రభుత్వ ఆసుపత్రిని తీసుకురావడంలో రాగిరెడ్డి పాత్ర మరువలేనిది ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజల ప్రజల దరికి చేర్చి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు మానవియా విలువలతో పాటు సమానత్వం న్యాయం పాలనలో బాధ్యత ఇవే రాజకీయ నాయకుడికి ఉండే నాయకత్వ లక్షణాలు బండారు రాజిరెడ్డి ది కథ కాదు మన భవిష్యత్తుకు మార్గదర్శక దీప స్తంభం ఆయన మనకు దూరమై కొద్దికాలం అవుతున్నప్పటికీ ఆయన ప్రజల నాలుకల్లో నానుతున్నాడు అంటే ఆయన చేసిన మంచి పనులే నిదర్శనం బండారు రాజిరెడ్డి 79 వ జయంతి సందర్భంగా స్మరణలో...

**కవి రచయిత.**
**దామరపల్లి నరసింహారెడ్డి.**
**9505555138.**

# ఓయూలో ఘనంగా ముగిసిన జాతీయ సదస్సు

- కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై లోతైన చర్చలు..

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. ఈ సదస్సులో సమకాలీన భారతదేశంలో కేంద్ర - రాష్ట్ర సంబంధాల పునఃఆవిష్కరణ, నియోజకవర్గాల పునర్విభజన, ఆర్థిక సమాఖ్యవాదం, ఒకే దేశం - ఒకే ఎన్నిక మరియు డిజిటల్ గవర్నెన్స్ అనే అంశాలపట్ల లోతైన చర్చలు నిరవించారు. ఈ సదస్సు ద్వారా దేశంలో సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి సంబంధించిన పలు సిఫార్సులు వెలువడినట్లు నిర్వాహకులు కాన్ఫరెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. కృష్ణ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మూడో రోజు జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి మణిపూర్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ తిరుపతి రావు ముఖ్య అతిథిగా హాజరై



మాట్లాడారు. భారత సమాఖ్య వ్యవస్థలో కేంద్ర - రాష్ట్ర సమన్వయం ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు విధాన సమన్వయం అవసరమని ఆయన అన్నారు. అనంతరం హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బిజు మాట్లాడుతూ.. సమకాలీన సమాఖ్య రాజకీయాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక ప్రతిపాదన, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, పాలనా సమర్థత మరియు ప్రజాస్వామ్య బాధ్యత మధ్య ఉన్న సంబంధాన్ని ఆయన వివరిస్తూ, ఈ అంశంపై శాస్త్రీయ చర్చలు కొనసాగాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ రాజనీతి శాస్త్ర విభాగం ఈ జాతీయ స్థాయి అకాడెమిక్ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. సమకాలీన రాజ్యాంగ, పాలనా అంశాలపై విశ్వవిద్యాలయ స్థాయిలో చర్చలు జరగడం సమాజానికి మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పాల్గొన్న పరిశోధకులు , అధ్యాపకులకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు, పరిశోధకులతో పాటు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ పీఠం బీఆర్ఎస్ పార్టీ కైవసం

- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠం కైవసం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని 36 వార్డులలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను నాయకులతో కలిసి సందర్శించారు. పోలింగ్ ఏ విధంగా జరుగుతుందని నాయకులను మరియు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన 36 కౌన్సిలర్ స్థానాల్లో సుమారు 28 కౌన్సిలర్లు విజయ డంక మోగిస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ ఆరచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అదేవిధంగా ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని విజయం మావైపే ఉందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కనుమరుగు ఖాయమన్నారు. పైలెట్ వెంట స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నేడు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య పిలుపునిచ్చారు. బుధవారం రోడామేస్త్రి నగర్ డివిజన్ శ్రీనివాస్ నగర్ లో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐలయ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేటు కంపెనీలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి వేయడానికి చూస్తుందని ఆరోపించారు. పేదవానికి బుక్కెడు బువ్వ దొరికే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మహాత్మగాంధీ పేరు మార్చి రాంజీ పేరు పెట్టి పేదల నోటి కాడి బుక్క గుంజుకుంటున్న బిజెపి పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి కార్యదర్శి నడిమింటి నాగరాజు,ఎం.జనార్ధన్ బండారి సంగ్రమం,బండి యాదగిరి,నరేష్ చారి,బాలాజీ,చంద్రయ్య పాల్గొన్నారు.

## రాంగోపాల్ పేట డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** రాంగోపాల్ పేట్ డివిజన్ లో శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీర్వాదంతో ఎన్నడు జరగని అభివృద్ధిని చేసి చూపించామని రాంగోపాల్ పేట్ డివిజన్ బీజేపీ తాజా మాజీ కార్పొ రేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు .ప్రజలు,అదికారులు,పార్టీ నాయకులు. కార్యకర్తల సహకారంలో గత ఐదు సంవత్సరాలుగా డివిజన్ లో ఎంతో ప్రగతి సాధించామన్నారు.బుదవారం పాన్ బజార్ లోని బీజేపీ కార్యాల యంలో ఆమె మీడియాతో గత ఐదు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. సంజీ వయ్య పార్క్ లో కేంద్ర ప్రభుత్వ నిధులు 50 కోట్లతో లైటింగ్ ఏర్పాటు చేశామని,ఎంపీ,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధులు కోటి రూపాయలతో పలు అభివృద్ధి కార్యమాలు చేశామన్నారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి సుమా రు రూ 40 కోట్ల మేరపలు అభివృద్ధి పనులు చేశామన్నారు.అందులో భాగంగా డ్రైనేజీ,మంచినీటి లైన్లు,నాళా ల పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు.15 కోట్ల రూపాయలతో 36 చోట్ల నూతన రోడ్డును నిర్మించామ న్నారు. తన సొంత ఖర్చుతో డివిజన్ లో పలు సేవా కార్యక్రమాలు చేశానని...కరోనా కాలంలో 15 రోజుల పా టు అన్నదానం చేశామని...ఆపదలో ఉన్న వారికి తమకు తోచిన సహాయం అందించామన్నారు.ఉచితంగా నిత్యా వసర సరుకులు పంపిణీ. పాఠశాల, కళాశాల విద్యార్థులకు బుక్స్, బ్యాగ్ లను పంపిణీ చేయడమే కాకుండా మెరిట్ స్టూడెంట్స్ కి స్కాలర్షిప్స్ కూడా అందజేశామన్నారు.ముఖ్యంగా



తాను కార్పొరేటర్గా ఉన్నప్పుడే దేశ ప్రధాని నరేంద్ర మోధీ,కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా,యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ లు మా డివిజన్ పరిధిలోని ఉన్న శ్రీఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

### పార్టీ మారను...తమ పార్టీ టికెట్ ఇవ్వకపోతే రెబల్గా బరిలో ఉంటా..

నాకు కన్నతల్లి లాంటి పార్టీ బిజెపి అని...పార్టీలోనే ఉంటానని ఆమె అన్నారు.కార్పొరేటర్ అభ్యర్థిగా తనకు మ రోసారి పార్టీ అవకాశమిస్తుందని ధీమా ఉందని...ఒక వేళ ఇవ్వకపోతే బీజేపీ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటా నని ఆమె స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులుఎస్ఆర్ మల్లేష్,చీర శ్రీకాంత్, మద న్, అశ్విని,నిర్మల,ప్రవీణ్,గోపీ కిషన్, తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం ఖాయం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** మున్సిపల్ చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం ఖాయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ (వార్డు నంబర్ 12)లో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరచిన కౌన్సిలర్ అభ్యర్థులు ఘనవిజయం సాదిస్తారని వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## కార్మికుల హక్కుల కోసం నేటి సమ్మెను విజయవంతం చేయండి



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** శ్రమజీవులు, కార్మికుల హక్కుల కోసం శేరిలింగంపల్లి అసంఘటిత రంగ, ఇతర రంగాల కార్మికులంతా కలసి వచ్చి నేడు జరగనున్న సమ్మెలో పాల్గొని దిగ్విజయం చేయాల్సిన అవసరం ఉందని సిఐటియు శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిహెచ్ఎంసి పరిధి మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ కు కృష్ణ సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఈఎస్ఐపిఎఫ్ సక్రమంగా అమలు చేయాలని, కార్మికులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికులకు 25 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గాయపడితే కనీస ప్రోత్సాహంగా 5 లక్షల రూపాయలు అందజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ మున్సిపల్ కార్మికులకు విధిగా అందజేయాలని పలు డిమాండ్లతో కూడిన మెమోరాండంను సమ్మె నోటీసులో భాగంగా అధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఏఐటీయూసి కార్యదర్శి చందు, శీను, దానయ్య నారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఆశా వర్కర్లకు వేతనాలు వెంటనే ఇవ్వాలి

**కాప్రా, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** ఆశ వర్కర్లకు జనవరి వేతనం కొంత మందికి ఇచ్చారు, కొందరికి ఇవ్వడం ఏం పద్ధతి అని ప్రశ్నించారు. అధికారులు ఆశా వర్కర్లతో రోజుకి ఆన్లైన్ పని టార్గెట్ పెట్టి చేయాలని బెదిరిస్తున్నారు . బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆశలకు వేతనం ఇవ్వాలని కోరుతూ కుషాయిగూడ పి.హెచ్.సి.లో ఆశా వర్కర్స్ నల్ల బ్లాక్ బడ్జె ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు.జిల్లా సహాయ కార్యదర్శి కె.ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు జనవరి వేతనం కొంత మందికి ఇచ్చారు, మిగిలినవారుకు వేతనాలు అడుగుతే ప్రభుతం దగ్గర డబ్బులు లేదు,డబ్బులు వచ్చాక ఇస్తామని అధికారులు సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వం అందరికీ వేతనాలు ఇవ్వడానికి డబ్బులు ఉంది, కానీ రూ. 9700/-జీతాలు తీసుకుంటున్న ఆశ వర్కర్లకు ఆశా వర్కర్లకు వేతనం ఇవ్వడానికి డబ్బులు లేదా అని ప్రశ్నించారు.జిల్లాలో 1270 ఆశా వర్కర్లలు ఉండగా కొందరికి ఇవ్వడం ఏం పద్ధతి అని ప్రశ్నించారు. అధికారులు ఆశా వర్కర్లతో రోజుకి ఆన్లైన్ పని టార్గెట్ పెట్టి చేయాలని బెదిరిస్తున్నారు.అసలు ఆన్లైన్ పని



ఆశా వర్కర్లదే కాదు ,వీరు ఏఎన్ఎం ఆన్లైన్అకౌంట్ లో లాగినై ఆన్లైన్ వర్క్ చేస్తున్నారు. ఇది కూడా రోజుకి 50-100 చేయాలని బలవంతం చేస్తున్నారు, చెయ్యకపోతే నానా దుర్భాషలు, బెదిరింపులు, చెయ్యకపోతే రాజీనామా చేయండి అని బెదిరిస్తున్నారు .ఈ చర్యలను సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఖండిస్తుంది. ఆశా వర్కర్లపై బెదిరింపులు ఆపకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లకు జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేపు జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు.

## బండ్లగూడ జాగీర్ విలీనంపై బీఆర్ఎస్ నిరసన



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** బండ్లగూడ జాగీర్ను గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ లో విలీనం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ళ నాగరాజ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి స్థానిక ప్రజల ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, రాముడు యాదవ్, ఎన్. వెంకటేష్, రవికుమార్, ఇస్మాయిల్, శాంతికుమార్, పెంటయ్య యాదవ్, నవీన్ ముదిరాజ్, పాండు, శాంతి నాయక్, గుండ్రపల్లి రాజీష్, రాజ్ కుమార్, స్యామ్యూల్, చంద్రశేఖర్, ఇమ్తియాజ్, రంజీత్, చంద్రరావు, టి. పెంటయ్య, గణేష్, రాకేష్, అఫ్రోష్, వెంకటేష్, ఉదయ్ గౌడ్, ఎన్. నాగరాజ్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అత్యంత సమస్యాత్మక, సున్నిత పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా లైవ్



వెబ్కాస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో నిరంతర సూక్ష్మ పరిశీలన, పర్యవేక్షణ నిర్వహించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు జిల్లా యంత్రాంగం పేర్కొంది.

## మల్కాజిగిరిలో అక్రమ నిర్మాణాల సీజ్

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- సిసిపి శ్రీనివాస్




**మల్కాజిగిరి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై మల్కాజిగిరి జిహెచ్ఎంసి అధికారులు కొరడా ఝుళిపించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని నాలుగు భవనాల కు నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు.టౌన్ ప్లానింగ్ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గౌతమ్ నగర్, పివిఎన్ కాలనీ, నరసింహారెడ్డి నగర్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.అనుమతి పొందిన దానికంటే అదనపు అంతస్తుల నిర్మాణం.సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకపోవడం.అనధికారికంగా భవన ప్లాన్లో మార్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన వాటిని సీజ్ చేశామని తెలిపారు. భవన యజమానులు, నిర్మాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వం ఆమోదించిన ప్లాన్ ప్రకారమే భవనాలను నిర్మించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా చేపట్టిన 4 నిర్మాణాలను సీజ్ చేసి, సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సంగీత, విజయ్, కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మక్తల్ మున్సిపాలిటీలలో 70.29% పోలింగ్

**మక్తల్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీకి సంబంధించి రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం అత్యంత ఉత్సాహపూరితంగా, ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, గంట గంటకూ ఓటర్ల రాక పెరుగుతూ వచ్చింది. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ పోలింగ్లో పట్టణ ప్రజలు తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చారు. మొత్తం 21,892 మంది ఓటర్లు ఉన్న ఈ మున్సిపాలిటీలో 15,369 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలలో 70.29% పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పురుషుల (7,613) కంటే మహిళా ఓటర్లే (7,756) అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు వేయడం విశేషం. ఎన్నికల నేపథ్యంలో పలువురు కీలక నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తన కుటుంబ సభ్యులతో కలిసి 7వ వార్డులోని 16వ పోలింగ్ బూత్ లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ



స్వచ్ఛందంగా ఓటు వేయాలని, అది మన బాధ్యత అని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సైతం కుటుంబ సమేతంగా 1వార్డులోని రెండవ బూత్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య 7వ వార్డులోని 17వ బూత్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజకీయ ప్రముఖుల రాకతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. వార్డుల వారీగా నమోదైన పోలింగ్ శాతం వివరాలను పరిశీలిస్తే పట్టణ ఓటర్ల మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. నాలుగో వార్డులో అత్యధికంగా 79.61 శాతం పోలింగ్ నమోదు కాగా, ఐదో వార్డులో అత్యల్పంగా 58.85 శాతం నమోదైంది. మిగిలిన వార్డుల పోలింగ్ శాతం ఇలా ఉంది. మొదటి వార్డు 79.43% రెండవ వార్డు 78.40%, మూడవ వార్డు 73.01%, నాలుగో వార్డులో 79.61%, ఐదో వార్డులో 58.85%, ఏడవ వార్డు 69.58%, ఎనిమిదవ వార్డు 61.95%, తొమ్మిదవ వార్డు 68.59%, పదవ వార్డు 72.21%, 11వ వార్డు 78.55%, 12వ వార్డు 69.94%, 13వ వార్డు 65.68%, 14వ వార్డు 75.29%, 15వ వార్డు 62.97%, మరియు 16వ వార్డులో 63.75% పోలింగ్ నమోదైంది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మక్తల్ టౌన్ లోని జడ్పీహెచ్ఎస్ స్కూల్, గార్లపల్లి లో ఎన్నికల ఓటింగ్ సరళి, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పోలీసు అధికారులు సిబ్బంది కి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపిఎస్ భద్రత పరమైన సూచనలు చేశారు. పోలీసు యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 13 న మున్సిపల్ ఎన్నికల అకౌంటింగ్ జరగనుందని అధికారులు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
12 ఫిబ్రవరి 2026

# వికారాబాద్ జిల్లాలో మున్సిపల్ పోలింగ్ ప్రశాంతం

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్నికలు జరుగుతున్న కారణంగా జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పరిగి తాండూర్ కొడంగల్ వికారాబాద్ పట్టణాలలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలియజేశారు. ఎన్నికల సందర్భంగా ప్రజలు రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలని తెలియజేశారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడైనా గొడవ జరిగితే వెంటనే చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించినట్లు తెలియజేశారు. కాగా తాండూర్ పట్టణంలో నేతాజీ గురుదేవ్ గురుకుల పాఠశాలలో



ఏర్పాటుచేసిన ఏడవ వార్డు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేయడానికి వచ్చారనే అనుమానంపై పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలింగ్ కేంద్రం వద్దకు రాగానే వారి ఐడి కార్డు తనిఖీ చేసి వివరాలు అడిగితే పొంతన లేకుండా సమాధానం చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చి పోలీస్ స్టేషన్ తరలించి విచారణ జరుపుకున్నారు. వారు నిజమైన ఓటర్లు అయితే వదిలేస్తామని దొంగ ఓటు వేయడానికి వస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు అంటున్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి పదేపదే వస్తున్నారని దొంగ ఓట్లు వేసే ప్రయత్నం చేస్తున్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కొందరు పోలింగ్ కేంద్రాల వద్దకు పదేపదే రావడం ఏమిటని వారిని వెంటనే పంపించాలని పోలింగ్ కేంద్రాల దగ్గర బందోబస్తులో ఉన్న పోలీసులతో మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి వాద్వివానికి దిగారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న రాజకీయ నాయకులను అందరిని అక్కడ నుంచి పంపి వేయడంతో గొడవ సర్దుమనిందింది. మిగతా అన్నిచోట్ల ఎన్నికల ప్రశాంతంగా జరగడంతో పోలీసులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటింగ్ సమయం ముగియగానే బ్యాలెట్ బాక్స్ లను సీజ్ చేసి సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రయత్నంలో అధికారులు పోలీసులు నిమగ్నమయ్యారు. ఓటర్లు ఏ అభ్యర్థులను వరిస్తారో ఎవరి తల రాత రాస్తారో ఈనెల 13వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు తో తేలుతుంది. అప్పటివరకు వేచి చూద్దాం.

## పెబ్బేరు పురపోరులో 83% ఓటింగ్ నమోదు..



**పెబ్బేరు, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** పెబ్బేరు పురపాలిక ఎన్నికల్లో బుధవారం 83% ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పుర పరిధిలో 12 వార్డుల గాను మొత్తం ఓటర్ల సంఖ్య 14,333 కలిగి ఉన్నారు. 12 వార్డులకు గాను 11వేల 870 నమోదయాయి. దీంతో 82.82% నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

### అంతా ప్రశాంతంగా..

ఎన్నికల ఏర్పాట్లు ఎన్నికల అధికారులు పోలీసులు ఎక్కడ ఇబ్బంది లేకుండా అంత ప్రశాంతంగా నడిపారు. 12 వార్డుల వారీగా 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. వికలాంగులకు మున్సిపల్ సిబ్బంది ఓటు వేంచేందుకు సహకరించారు. అడిషనల్ కలెక్టర్ యాదయ్య జిల్లా ఎస్పీ సునీత రెడ్డి పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఖానామెట్‌లో 5 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి పరిధిలో భూ కబ్జాదారులపై హైడ్రా దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మంగళవారం 700 కోట్ల రూపాయల విలువ చేసే కొండాపూర్ జంగమోనికుంట నాలుగెకరాల స్థలాన్ని మరువకముందే తాజాగా బుధవారం మాదాపూర్ డివిజన్ పరిధి ఖానామెట్ ప్రాంతంలో గతంలో ఆల్ ఇండియా వెలమ సంక్షేమ సంఘం కోసం కేటాయించిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు మెల్లగా కబ్జాచేసే క్రమంలో భాగంగా మట్టితో దానిని చదును చేస్తున్న తీరును గమనించిన స్థానికులు ప్రజావాణి కార్యక్రమం ద్వారా నేరుగా హైడ్రా సంస్థకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇందులో భాగంగా కుల సంఘాల పేరుతో అత్యంత విలువైన 5 ఎకరాల స్థలాన్ని కేటాయించడానికి సవాలు చేస్తూ ఇప్పటికే కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా దానిపై కోర్టు స్టే విధించిన విషయం విధితమే. కానీ సందట్లో సడేమియాలా కొందరు స్థానికులు సదరు ఐదు ఎకరాల స్థలంలో ఓవైపు మట్టితో పూడుస్తూ దానిని ఆక్రమించే యత్నం చేస్తున్న విషయం హైడ్రా దృష్టికి రావడంతో బుధవారం సదరు స్థలాన్ని సందర్శించి కబ్జా జరుగుతున్న వైనాన్ని రూఢి చేసుకుని ఆ స్థలంలో చుట్టూ ఫ్రీ కాస్ట్ వాల్ తో కంచను ఏర్పాటుచేసి నోటీసు బోర్డును ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ఓవైపు అక్రమార్కులకు ఇది మింగుడు పడని అంశం కాగా మరోవైపు బాధ్యత వర్గం వ్యక్తం చేస్తుండడం విశేషం.

## ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి



**జోగిపేట, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధి 9 వార్డులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం 13 లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ సందర్భంగా ఆయన ప్రజలను ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు ఓటు హక్కు మనకు రాజ్యాంగం ఇచ్చిన ఆయుధం అ

## పోలీసులపై అవమానంగా మాట్లాడిన జగ్గారెడ్డిని శిక్షించాలి

- ఎన్నికల కౌంటింగ్ లో జగ్గారెడ్డి అల్లకల్లోలం సృష్టిస్తారు
- పోలీసులపై ద్రుభాషలాడిన జగ్గారెడ్డి
- ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు
- కాంగ్రెస్ నేత పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫైర్



**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు జగ్గారెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పోలీసులను, ప్రభుత్వ సిబ్బందిని భయపెట్టే విధంగా జగ్గారెడ్డి ప్రవర్తిస్తున్నారని అన్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ సంగారెడ్డి లో పోలీసులపై జగ్గారెడ్డి మాట్లాడిన తీరు పూర్తిగా అవమానకరమని చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో డీజీపీ స్వయంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ సమయంలోనే ఇలా ప్రవర్తిస్తే, కౌంటింగ్ సమయంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారంలో పోలీస్ సంఘాలు ఎలా స్పందించాయో, ఇప్పుడు కూడా అదే విధంగా స్పందించాలని చింతా ప్రభాకర్ సూచించారు. అదేవిధంగా, యాక్టివ్‌గా ఉన్న బిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు బైండోవర్ చేస్తున్నారని ఆరోపించిన ఆయన, బైండోవర్ చేయాల్సి వస్తే ముందుగా జగ్గారెడ్డినే బైండోవర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డా.శ్రీహరి, మందుల వరలక్ష్మి, శ్రీధర్ రెడ్డి,మల్లగౌడ్, కొండల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మల్ల గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఎలక్షన్ సరళి, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు నారాయణపేట, మక్తల్, కోస్గి మద్దూర్ నాల్గు మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. బుధవారం రోజు మక్తల్ లోని జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో, గార్ల పల్లి లో నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్ హై స్కూల్లో నీ పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సరళి, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్త్ ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ స్వయంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా శాంతియుత వాతావరణం మున్సిపల్ ఎన్నికలు కొనసాగేలా చూడాలని అలాగే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.మున్సిపల్ ఎన్నికలు సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, క్యూ లైన్ లో ఉండేలా చూడాలని ఆయన తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీస్ విభాగం హై అలర్ట్‌లో కొనసాగాలని, శాంతి-భద్రతలను కాపాడడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతగా ఉండాలని తెలిపారు ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎస్పీ తెలిపారు.ఎస్పీ తో పాటు డీఎస్పీ మహేష్, సీఐ లు శివశంకర్, రవి బాబు, రామ్ లాల్, ఎస్ఐలు నరేష్, వెంకటేశ్వర్లు, భాగ్య లక్ష్మి రెడ్డి, బిజూ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వెబ్‌కాస్టింగ్‌తో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మల్దకల్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే గద్వాల, అలంపూర్, ఐజ,వడ్డేపల్లి మునిసిపాలిటీలలోని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహణను జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. బుధవారం ఉదయం ఐడిఓసి సమావేశపు మందిరంలో వెబ్ కాస్టింగ్ తో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తూ ప్రిసైడింగ్ అధికారులు,ఇతర సిబ్బంది విధులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికలు జరిగే నాలుగు పురపాలక సంఘాల్లో మొత్తం 77 వార్డుల్లో అలంపూర్ లోని పదవ వార్డు ఏకగ్రీవం కాగా మిగిలిన 76 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆయా పోలింగ్ స్టేషన్లలో మొత్తం 189 మంది చొప్పున ప్రిసైడింగ్,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు,567 మంది ఓపిఓలు విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. వీరికి రిటర్నింగ్, జోనల్, మున్సిపల్, పోలీస్, ఇతర సిబ్బంది పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు సహకరిస్తున్నారన్నారు. ఆయా పురపాలికల్లో మొత్తం 1,08,524 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.ఇందులో 55,661 మంది మహిళలు,52,851 మంది పురుషులు, ఇతరులు 12 మంది ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎన్నికల అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ వేదికగా మారుమోగిన బాల ఒగ్గు కళాకారుల ప్రదర్శన

- వికారాబాద్ జిల్లా నుండి 9 మంది కళాకారుల ప్రదర్శన
- అబ్బురపరిచిన విన్యాసాలు



**బొంరాస్‌పేట, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా అంతర్జాతీయ నాట్య మహోత్సవం బాల సంఘం ఆధ్వర్యంలో బాల ఒగ్గు కళాకారుల ప్రదర్శన బుధవారం మొదటి రోజు ప్రేక్షకులను అబ్బురపరిచేలా విన్యాసాలు ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్రం నుండి 20 మంది ప్రదర్శన నిర్వహించగా అందులో వికారాబాద్ జిల్లా నుండి 9 మంది ఒగ్గు కళాకారులు పాల్గొన్నారు. 9 మంది కళాకారులకు మండల పరిధిలోని నాందార్ పూర్ గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు సంఘం శివకుమార్ టీం లీడర్ గా వ్యవహరించారు. ఈనెల 14 వరకు విన్యాసాలు కొనసాగుతాయని శివకుమార్ తెలిపారు.ఢిల్లీ స్థాయిలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన బాల కళాకారులను నాందార్ పూర్ గ్రామ సర్పంచ్ లక్ష్మీ,పంచాయతీ కార్యదర్శి శోభారాణి,గ్రామస్తులు మల్లికార్జున్, కుంభల్ల మల్లప్ప,గోపాల్ నర్సింలు శ్రీశైలం సాయప్ప మల్లేష్ రాఘవేందర్ సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

## ఘనంగా శివ స్వాముల మహా పడిపూజ



**వెల్దండ, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో శివ స్వాముల మహా పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు కుమారస్వామి, జగన్ ఆచారి, ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్, ఉప సర్పంచ్ రామకృష్ణలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిట్ల పూజలు నిర్వహించి భజనలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన శివ స్వాములు పడిపూజ లో పాల్గొని శివనామస్మరణ అని జపించారు. పడిపూజ సందర్భంగా భక్తి గీతాలు, భజనలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు మహేష్, బన్నీ, తిరుపతయ్య, అంజయ్య, మల్లేష్, నరసింహ్మ, బాలాజీ, బాబురావు, బాబుజి స్వామి, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ ప్రక్రియపై నిశితంగా పరిశీలన చేసిన ఆయన, కొన్ని కేంద్రాల్లో ఏర్పాట్లలో లోపాలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరగాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికార పార్టీ ప్రభావం, ఒత్తిడులు, అక్రమాలు చోటుచేసుకుంటే తీవ్రంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. కొన్ని చోట్ల ప్రతిపక్ష కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వచ్చాయని, అలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డా.శ్రీహరి, శ్రీధర్ రెడ్డి, లాడే మల్లేశం, శ్రవణ్ రెడ్డి, మోహన్ సింగ్, లాడే బాలు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీల ఎన్నికలు ప్రశాంతం

- జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 11 (జనంసాక్షి) : వనపర్తి జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత 5 మున్సిపాలిటీలకు బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత 5 మున్సిపాలిటీల్లో మొత్తం కలిపి 88,738 ఓట్లు పోల్ కాగా, 75.56% వోటింగ్ పర్సంటేజీ నమోదయిందని కలెక్టర్ తెలిపారు.కాగా, మున్సిపాలిటీ వారీగా చూసుకుంటే వనపర్తిలో 45,904 ఓట్లు పోల్ కాగా 71.51%, కొత్తకోటలో 14,319, ఓట్లు పోల్ కాగా 78.71% పెబ్బేరు లో 11,912 ఓట్లు పోల్ కాగా 83.11%, ఆత్మకూరు లో 8958 ఓట్లు పోల్ కాగా 7736%, అమరచింత 7645 ఓట్లు పోల్ కాగా 83.58% నమోదైనట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటల నుండి ప్రారంభమయి సాయంత్రం 5.00 గంట వరకు జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ తీరును కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, సాధారణ ఎన్నికల పరిశీలకులు లక్ష్మి బాయి, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ తో కలిసి పర్యవేక్షించారు.అంతకుముందు కలెక్టర్ పోలింగ్ ప్రారంభమైన వెంటనే వనపర్తి మున్సిపాలిటీలోని తొమ్మిదవ వార్డు మర్రికుంట పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రానికి చేరుకొని వరుసలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా, కలెక్టర్ వనపర్తి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 23, 15 వ వార్డు, హరిజనవాడ జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన 19, 21వ వార్డు లోని పోలింగ్ కేంద్రాలని సందర్శించి సరళిని పరిశీలించారు.మర్రికుంట మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద



మీడియాతో మాట్లాడిన కలెక్టర్ ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. పోలింగ్ నేపథ్యంలో పోలీస్ శాఖ ద్వారా కట్టుదిట్టమైన శాంతిభద్రతలు అమలు చేసినట్టు తెలిపారు. పోలైన ఓట్లను పకడ్బందీ పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియపై నిశిత పర్యవేక్షణ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద




వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 11(జనంసాక్షి): మునిసిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట పట్టణాల్లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేటలలో ఏర్పాటు చేసిన మొత్తం 80 పోలింగ్ కేంద్రాల కార్యకలాపాలను, పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయం తో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం కూడా నేరుగా వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండేలా సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులు, సిబ్బంది నియామకం తదితర అంశాల్లో పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీలో ప్రశాంతంగా పోలింగ్

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం జడ్పి ఉన్నత పాఠశాల, హనుమాన్ నగర్‌లోని మాస్టర్ మైండ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి సందర్శించి ఏర్పాట్లు, ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 52,726 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 26,786 మంది పురుషులు, 25,936 మంది మహిళలు, ఇతరులు 4 మంది ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం 30 వార్డులకు 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 104 మంది ప్రెసైడింగ్ అధికారులు, 104 మంది అసిస్టెంట్ ప్రెసైడింగ్ అధికారులు, 312 మంది ఇతర పోలింగ్ అధికారులు విధులు నిర్వహించినట్లు వివరించారు. అనంతరం ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. 86 పోలింగ్ కేంద్రాల్లో 149 వెబ్‌కాస్టింగ్ యూనిట్ల ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగించినట్లు తెలిపారు. కొన్ని కేంద్రాల్లో లోపల, బయట రెండు చోట్లా వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా కొనసాగినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసు, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**కౌంటింగ్ సిబ్బంది శిక్షణ తరగతులకు హాజరు కావాలి..**

కౌంటింగ్ సిబ్బంది శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ కోరారు. భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు నియమితులైన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ విధులకు నియమించబడిన సిబ్బందిని వారి సంబంధిత అధికారులు రెండు రోజులపాటు విధుల నుండి విడుదల చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ శిక్షణ తరగతి 12న ఉదయం 10:30 గంటలకు భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించబడుతుందని తెలిపారు. నియమితులైన సిబ్బంది అందరూ సమయానికి హాజరై శిక్షణలో పాల్గొనాలని సూచించారు. అలాగే కౌంటింగ్ విధులు 13న ఉదయం 7:00 గంటలకు అదే ప్రాంగణంలో ప్రారంభమవుతాయని, అందరూ తప్పనిసరిగా హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరి సహకారం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

- మంచు కారణంగా ఆలస్యంగా ఓటెయ్యడానికి వచ్చిన ఓటర్లు
- డిసి తండా వద్ద కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల వాగ్వివాదం
- ఓటింగ్ సరళి పరిశీలించిన కలెక్టర్, ఆర్డీవో



వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. అయితే ఉదయం మంచుతో ఉండడంవల్ల ఓటు వేయడానికి ఓటర్లు కొంత ఆలస్యంగా రావడం జరిగింది. మధ్యాహ్నం నుంచి ఓటు వేసే వాళ్ళ సంఖ్య వేగంగా పెరిగింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 12 వార్డులు ఉన్నాయి 20 బూతులున్నాయి. వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పుష్కో స్కూల్, ఫిరంగి గడ్డ, భవాని కుంట తండా, డిసి తండా, గుబ్బెట తండా మొదలైన 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం పది,526 ఓటర్స్ తమ ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితి ఉండగా మధ్యాహ్నం మూడు గంటల వరకు 77.22% ఓటింగ్ నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే సమయం వరకు మరింత ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.

**ఓటింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్, ఆర్డిఓ**

వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద తోపాటు ఆర్డీవో సుమ పరిశీలించారు. అదేవిధంగా వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ కూడా ఓటింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న పరిస్థితులను పరిశీలించారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించే తీరును, ఎక్కడ వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేలా తీసుకునే చర్యలను వారు గమనించారు. అదేవిధంగా వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్ తో పాటు ఇక్కడ వేస్ట్ టు బెల్ట్ అనే స్టాల్ ను కూడా పరిశీలించారు. అదేవిధంగా నా భారతదేశం నా ఓటు అనే సెల్ఫీ పాయింట్లు కూడా కలెక్టర్, ఆర్ డి ఓ గమనించారు.

**డిసి తండా వద్ద కాంగ్రెస్, టిఆర్ఎస్ వాగ్వివాదం**

మున్సిపాలిటీ పరిధిలోని డిసి తాండ పోలింగ్ కేంద్రం వద్ద ఇటు కాంగ్రెస్ అటు బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు మధ్య వాగ్వివాదం చేసుకుంది. తమ తండాను మున్సిపాలిటీలో కల్పి తముకు అన్యాయం చేశారంటూ గత ప్రభుత్వాన్ని నిందిస్తూ స్థానికులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు నిరసన తెలిపారు. ఈ క్రమంలో బి ఆర్ ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో అక్కడే ఉన్నటువంటి పోలీసులు ఇరు వర్గాలను అక్కడ నుంచి పంపించి ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా వర్ధన్నపేటలోని పుష్కో స్కూల్ వద్ద మూడో వార్డు కు సంబంధించిన పోలింగ్ బూతుల వద్ద కాంగ్రెస్, బి ఆర్ ఎస్, బిజెపి నాయకుల మధ్య వాగ్వాదము తోపులాట మొదలైనవి జరిగాయి. కొందరు అభ్యర్థులు పోలింగ్ బూత్ వద్ద డబ్బులు పంచుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. అయితే సమస్య సద్దుమణిగేలా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




ములుగు బ్యూరో,ఫిబ్రవరి11(జనం సాక్షి): ములుగు కొత్త మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రములో వార్డు నెంబర్ 14 లో బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు.ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా ఓటు వేయాలని స్థానిక సుపరిపాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు.అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంప్స్ నిర్మించడమే కాక వీల్ చైర్స్ ను అందుబాటులో ఉంచామన్నారు.ఎన్నికల సంఘం గుర్తించిన 18 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి పోలింగ్ స్టేషన్ లొ అక్కడి అధికారులకు చూయించి ఓటర్లు తమ ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.




# వరుసలో నిలబడి, ఓటువేసి...

ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం స్థానిక సాత్నాల క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వార్డు నంబర్ 38, పోలింగ్ స్టేషన్ నంబర్ 170 వద్ద ఆయన సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి**



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి11 (జనం సాక్షి) : మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పట్టణంలోని గాజులపేట్ వార్డు నెంబర్ 35 లో బుధవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పటిష్టతకు పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# చెస్ బోర్డులు పంపిణీ




వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) : చెస్ నెట్‌వర్క్, ప్రతిమ ఫౌండేషన్ సమన్వయంతో బుధవారం ఉదయం పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చెస్ బోర్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బోయినపల్లి హరిణి హాజరై మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మోడల్ స్కూల్,కస్తూరిబా గాంధీ విద్యాలయం, మైనారిటీ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలకు చెస్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బోయినపల్లి హరిణి మాట్లాడుతూ చెస్ అనేది 64 గళ్లతో ఇద్దరు ఆటగాళ్లు ఆడే మేధో క్రీడ అని పేర్కొన్నారు.ఈ ఆట ద్వారా వ్యూహరచన,ఏకాగ్రత,మేథోశక్తి, ఓపిక,సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందుతాయని తెలిపారు.ఆటలో ఓడినా మళ్లీ గెలుస్తామనే నమ్మకం కలుగుతుందని, ఓటమి గెలుపుకు పునాది అవుతుందని చెప్పారు.చెస్‌ను మనసుపెట్టి నేర్చుకుంటే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తుందని సూచించారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ కుమార్, చెస్ నెట్వర్క్ ఫౌండర్ కోదాడ సుధీర్, ఎంఈఓ బిక్షపతి,రిటైర్డ్ ఎంఈఓలు లింగారెడ్డి, అశోక్, రిటైర్డ్ డిగ్రీ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్,వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటినుండి ముయ్యాలమ్మ తల్లి జాతర ప్రారంభం

- గొంది వంశీయుల ఇలావేల్పు ముయ్యాలమ్మ తల్లి
- ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెద్ద పండుగ



గోవిందరావుపేట (జనంసాక్షి) : పసర గ్రామంలో మేడారం సమ్మక్క తల్లి మేన కోడలైన శ్రీ ముయ్యాలమ్మ తల్లి జాతర నేటి నుండి ప్రారంభం కానుంది.గత 80 సంవత్సరాల నుండి గొంది వంశీయులు ప్రతి రెండేళ్లకోసారి వచ్చే పెద్ద జాతరను గొంది వంశీయుల కుటుంబాలు,కుల పెద్దలు అంతా ఏకమై వారి కుల దైవమైన ముయ్యాలమ్మ జాతరను పసర గ్రామంలో ఎంతో ఘనంగా గొంది వంశీయులు అంగరంగ వైభవంగా జాతరను జరుపుకుంటారు. పసర గ్రామంలో నివసిస్తున్న గొంది వంశీయుల అందరూ కలిసి వారి ఇలవేల్పు అయిన ముయ్యాలమ్మ తల్లి జాతరను గొంది నరసయ్య, ముద్దబోయిన రాము,గొంది రామచందర్, పాయం నారాయణ,మడి సాయిబాబా,గొంది రాజు,కుల పెద్దమనిషి గొంది రామచందర్లు, గొంది పొమ్మయ్య,గొంది ఎర్ర ముయన్న, గొంది కిరణ్,గొంది రాజేష్ ఈ ముఖ్యమైన కుటుంబాల ఆధ్వర్యంలో జాతరను నిర్వహిస్తుంటారు.మీడియాతో ముయ్యాలమ్మ జాతర గొంది వంశీయుల కుల పెద్దమనిషి గొంది రామచందర్ మాట్లాడుతూ నెల11 బుధవారం రోజు నుండి మండే మెలుగుట, పాన్పు తెచ్చుట కార్యక్రమాన్ని సాయంత్రం నిర్వహించనున్నట్లు, 12 న గురువారం ఉదయం వనం తెచ్చే కార్యక్రమం, సాయంత్రం గుట్ట నుండి అమ్మవారిని తీసుకొని వచ్చి గద్దెపై ప్రతిష్ఠింపజేయడం జరుగుతుందని,13 శుక్రవారం తల్లికి మొక్కులు చెల్లించే కార్యక్రమం ఉంటుందని ఆయన అన్నారు.తిరిగి14 న శనివారం తల్లిని వన ప్రవేశం చేయడం జరుగుతుందని వివరించారు. ముయ్యాలమ్మ జాతర జరిగే సమయాన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన మండల ప్రజల్ని కోరినారు.ఈ కార్యక్రమంలో గొంది వంశీయులు,కుల పెద్దలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ హిత మోడల్, గ్రీన్ పోలింగ్ స్టేషన్లను సందర్శించిన జనరల్ అబ్జర్వర్..



నర్సంపేట, ఫిబ్రవరి 11(జనంసాక్షి): మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జనరల్ అబ్జర్వర్ కే. శివకుమార్ నాయుడు నర్సంపేటలో ఏర్పాటు చేసిన పర్యావరణ హిత మోడల్ పోలింగ్ స్టేషన్ మరియు గ్రీన్ పోలింగ్ స్టేషన్‌లను బుధవారం సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లు, సౌకర్యాలు, పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఓటర్లకు అందిస్తున్న సౌకర్యాలు, పారదర్శకత, భద్రతా చర్యలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.గ్రీన్ పోలింగ్ స్టేషన్‌లో చేపట్టిన పర్యావరణహిత చర్యలు, పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను ఆయన అభినందించారు. మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, ప్రత్యేక ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు.ఈ సందర్భంగా నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జీఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పరకాలలో పోలింగ్ ప్రశాంతం

- పోలింగ్ 80.16 శాతం నమోదు




హనుమకొండ ప్రతినిధిన. ఫిబ్రవరి 11 (జనంసాక్షి) : హనుమకొండ జిల్లాలోని పరకాల మున్సిపాలిటీ లో 22 వార్డు స్థానాలకు గాను బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పరకాల మున్సిపాలిటీ పరిధిలో 44 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సాగింది. ఆయా వార్డుల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డు స్థానాలకు గాను 44 పోలింగ్ కేంద్రాలలో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా సాగినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. పోలింగ్ 80.16 శాతం నమోదయినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ 13 వార్డులను సమస్యాత్మకంగా గుర్తించామని, వీటి పరిధిలో 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వంద శాతం వెబ్ కాస్టింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ కొనసాగేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 26,784 ఓటర్లు ఉండగా 21469 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు.

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్**

పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. వెలమవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (మూడో వార్డు)ఆరో పోలింగ్ కేంద్రాన్ని.. మోడల్ పోలింగ్ కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేయగా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ ఎన్.రవి పరిశీలించారు. మోడల్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

**పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు శివ కుమార్ నాయుడు**

రెండో సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా పరకాలలో పోలింగ్ ప్రక్రియ ను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు కె. శివకుమార్ నాయుడు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని పోలింగ్ కేంద్రాలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**స్ట్రాంగ్ రూమ్ కు బ్యాలెట్ బాక్స్ లు, పోలింగ్ సామగ్రి తరలింపు**

పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పరకాల లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ కు పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు తరలించారు. 22 వార్డుల సంబంధించి 44 పోలింగ్ కేంద్రాల వారీగా బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది స్ట్రాంగ్ రూమ్ నకు చేరుకున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. ఇక్కడే ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఈనెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి పరకాల ఆర్డిఓ డాక్టర్ కే నారాయణ పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఎంపీడీవో రవీందర్ గౌడ్ టౌన్ ప్లానర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
12 ఫిబ్రవరి 2026

## ఎన్నికల విధులకు గైర్హాజరైన 17 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ



**చండూరు, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. అందులో భాగంగా చండూరు మున్సిపాలిటీకి కేటాయించిన 17 మంది అధికారులు ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో చండూరు మున్సిపల్ ఎన్నికల విధులకు గైర్హాజరైన 17 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.జి.ఏ. కుమార్ టి ఎస్ ఆర్ టి సి, ఎండి అశ్రాప్ జహా ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ఎం.ఎ. ఫహీమ్ మైనార్టీ ఆఫీసర్, ఎం. శ్రీదేవి స్కూల్ అసిస్టెంట్, యాట మధుసూదన్ స్కూల్ అసిస్టెంట్ నకిరకల్, టి. గాయిత్రి కేజీబివి తిప్పర్తి, పి. ప్రజ్వల కేజీబివి కనగల్, నాసేమున్నిస్సా టీచర్ నల్లగొండ, జి . సంతోషికుమారి కేజీబివి కనగల్, జీడిమెట్ల స్వరాజ్యం టీచర్ మైలారం, బి లలిత హెడమాస్టర్ అక్కలయ్య గూడెం, బత్తుల భాస్కర్ ఎంపిపిఎస్ మర్రిగూడ, ఎం లలిత కేజీబివి కనగల్, ఎస్ పద్మ టీచర్ చెర్వుగట్టు, ఈ. రమేష్ ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నల్లగొండ, కే కుశలయ్య ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నల్లగొండ, పి.ఏడుకొండలు జూనియర్ అసిస్టెంట్ ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నల్లగొండలో నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు.

## పోచంపల్లి మున్సిపల్‌లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- 90.94 శాతం పోలింగ్ నమోదు
- 13 వార్డుల్లో 40 మంది అభ్యర్థులు బరిలో..



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు అధికారులు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 13 వార్డులకు గాను 40 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించారు. మొత్తం 15,827 మంది ఓటర్లు ఉండగా, వారిలో 14,394 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో పురుషులు 7,098 మంది కాగా, మహిళలు 7,296 మంది ఉన్నారు. దీంతో 90.94 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఫలితాలపై అభ్యర్థులు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది.


## బ్యాంకు ఖాతాలను వెంటనే కేవైసీ చేయించుకోవాలి



**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** బ్యాంకు ఖాతాదారులందరూ విధిగా తమ బ్యాంకు ఖాతాలను వెంటనే కేవైసీ చేయించుకోవాలని కొండమల్లేపల్లి ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ చింత సందీప్ ఖాతాదారులకు సూచించారు. బుధవారం మండలంలోని చింతకుంట్ల గ్రామంలో ఆర్బీఐ ఆదేశానుసారం విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్బీఐ, సీబీఐ బ్యాంకు ఖాతాదారులకు నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మేనేజర్ బ్యాంకులు ఖాతాదారులకు అందిస్తున్న వివిద రకాల రుణాలు, సేవల గురించి వివరించారు. రుణాలు తీసుకున్న ఖాతాదారులు సకాలంలో వాయిదా నగదు చెల్లించి బ్యాంకుల, ఖాతాదారుల ఉన్నతికి తోడ్పడాలని తెలిపారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ కావటి వెంకటేశ్వర్లు, ఏరియా మేనేజర్ డి బాలకృష్ణ, విడ్స్ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ అంకులమ్మ, సీఎస్పీ నిర్వాహకులు రాము, జవహర్లాల్, అరవింద్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత శక్తివంతమైంది

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.జిల్లా కేంద్రంలోని 14వ వార్డ్ కృష్ణా కాలనీలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లో తన ఓటు వేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాడుగులపల్లిలో అటకెక్కిన అభివృద్ధి

- రూ. 25 లక్షల ప్రజాధనం బుగ్గిపాలు!
- పిల్లర్లకే పరిమితమైన అంబేద్కర్ భవన నిర్మాణం
- తుప్పు పడుతున్న ఇనుప చువ్వలు
- కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న స్థానిక ప్రజలు




**మాడుగులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** ప్రభుత్వ నిధులు అంటే పాలకులకు, అధికారులకు ఎంత నిర్లక్ష్యమో మాడుగులపల్లి మండల కేంద్రంలో వెలిసిన ఈ అసంపూర్తి అంబేద్కర్ భవనమే సాక్ష్యం. ప్రజల అవసరాల కోసం రూ. 25 లక్షల భారీ వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణం, నేడు పిచ్చిమొక్కలకు నిలయంగా మారి ప్రజాధనాన్ని వెక్కిరిస్తోంది. కనుచూపు మేరలో కదలని పనులు ఏళ్ల క్రితం ఎంతో ఆర్భాటంగా ఈ భవనానికి శంకుస్థాపన చేసి, పునాదులు తీసి, పిల్లర్లు లేపి వదిలేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ గానీ, పర్యవేక్షించాల్సిన అధికారులు గానీ అటువైపు కన్నెత్తి చూడలేదు. ఫొటోలో కనిపిస్తున్నట్లుగా, ఆకాశం వైపు చూస్తున్న ఇనుప చువ్వలు ఎండకు ఎండి, వానకు తడిసి పూర్తిగా తుప్పు పట్టిపోయాయి. లక్షలాది రూపాయల విలువైన ఇనుము, సిమెంట్ ఇలా నేలపాలవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముళ్ళ పొదల చాటున అభివృద్ధి నిర్మాణ ప్రాంతం చుట్టూ దట్టమైన ముళ్ళ పొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. అసంపూర్తిగా ఉన్న ఈ కట్టడం ఇప్పుడు చెత్త వేయడానికి, కట్టెలు పోగు చేసుకోవడానికే పరిమితమైంది. సకాలంలో పూర్తి చేసి ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ భవనం, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల నిరుపయోగంగా మారింది. ప్రశ్నిస్తున్న ప్రజలు రూ. 25 లక్షల నిధులు మంజూరైనా పనులు ఎందుకు ఆగిపోయాయి కాంట్రాక్టర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. తుప్పు పట్టిన ఈ పిల్లర్లపై భవిష్యత్తులో నిర్మాణం చేపడితే అది నాణ్యతగా ఉంటుందా? అధికారులు స్పందించాలి. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఈ అసంపూర్తి భవనంపై విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా చూడాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



**కామేపల్లి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** కామేపల్లి మండల కేంద్రంలో ఉన్న కామేపల్లి పి హెచ్ సి నీ సందర్శించినారు. అన్ని విభాగాలను తిరిగి ప్రతి ఒక్క సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఇన్ పేషెంట్ వార్డ్, ల్యాబ్,స్టోర్ రూమ్ పరిశీలించి తగు సూచనలను చేశారు. వేసవి కాలము దృష్ట్యా గ్రామ ప్రజలకు విద్యార్థులకు వృద్ధులకు వడదెబ్బ తగలకుండా ఆరోగ్య జాగ్రత్తల గురించి సూచనలు చేసినారు టెన్త్ క్లాస్ పిల్లలకు ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు పరీక్షలకు రాయడానికి వెళ్ళు సమయములో వారు భయపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని సలహాలు సూచనలు ఇస్తూ పరీక్షలు మంచిగా రాయాలని. పరీక్ష కేంద్రంలో కావలసిన అన్ని వసతులు ఏర్పాటు చేసి మెడికల్ టూల్ కిడ్స్ అందుబాటులో ఉండేటట్టు మండల అధికారులు చొరవ చూపాలని. విద్యార్థులకు మంచి సూచనలు ఇస్తూ మనోధైర్యాన్ని కలిగించాలని వారు తెలిపారు.ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు స్టాఫ్ సిబ్బందులపై ప్రజలకు రోగుల పట్ల సరదా వహిస్తూ మంచి నమ్మకం కలిగేటట్టు ముందస్తు సలాలు సూచనలు ఇస్తూ వెళ్లాలని వారు అన్నారు. అలాగే హెచ్ఓకే వెంకటేశ్వర్లు, పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ తనుషా,సూపర్వైజర్ రాధాకృష్ణ,నర్సింగ్ ఆఫీసర్ పుష్పలత, హెల్త్ అసిస్టెంట్ తిరుమలయ్య, శ్రీనివాస్,ఏఎన్ఎం రమణ,ఉష ఎల్టి ఉమామహేశ్వరరావు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు



**వలిగొండ, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** భువనగిరి జిల్లా పరిధిలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలో భాగంగా లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థులు ఖో ఖో పోటీలో ద్వితీయ బహుమతి గెలుపొందారు వీరిలో నలుగురు విద్యార్థులు లోకేష్ కుమార్, ప్రశాంత్ కుమార్, నిఖిల్, యశ్వంత్ చారి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ జి ఐలయ్య బుధవారం తెలిపారు. వీరిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి జలంధర్ రెడ్డి ,మండల విద్యాధికారి ఎస్ భాస్కర్, ఎస్సై యుగంధర్ గౌడ్ ,పాఠశాల ప్రిన్సిపాల్ రయిసున్నీస బేగం , లోతుకుంట గ్రామ సర్పంచ్ రాములు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** సూర్యాపేట, హుజూర్ నగర్, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో జడ్పి ఉన్నత పాఠశాల, ఆనంద్ విద్యా మందిర్ హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తేజ హైస్కూల్, చుక్కారామయ్య హైస్కూల్, కుడకుడలోని ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి సందర్శించి ఏర్పాట్లు, ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా కొనసాగుతుందని తెలిపారు.ఎన్నికలు స్వేచ్ఛయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎన్నికల సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేరేడుచర్ల మున్సిపాలిటీలో 79.24% పోలింగ్ నమోదు

**నేరేడుచర్ల, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నాడు జరిగిన రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీ లోని మొత్తం 15 వార్డులకు గాను 79.24 శాతం పోలింగ్ నమోదైనట్లు మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు తెలిపారు.15 వార్డులలోని మొత్తం 13,746 మంది ఓటర్లకు గాను,10,893 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 6,629 మంది పురుష ఓటర్లకు గాను 5,142 మంది పురుషులు, 7,116 మంది మహిళా ఓటర్లకు గాను 5750 మంది, ఇతరులు 01 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులలో 7వ వార్డులో అత్యధికంగా 93.19% నమోదు అవ్వగా, అత్యల్పంగా 13వ వార్డులో 73.22% ఓటింగ్ నమోదయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారు తగు భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నికల సరళిని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్




**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో జరిగిన ఓటింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 32 వార్డులకు గాను ఒక వార్డు ఏకగ్రీవం కావడంతో 31 వార్డులకు బుధవారం పోలింగ్ జరిగింది.31 వార్డుల పరిధిలో మొత్తం 43,811 మంది ఓటర్లు ఉండగా వారిలో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి గాను 37,391 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 177 మంది కాగా మహిళా ఓటర్లు 1,962 మంది ఉన్నారు. మొత్తం మున్సిపాలిటీ పరిధిలో 85.35% పోలింగ్ నమోదైనటు సంబంధిత అధికారులు ప్రకటించారు. వార్డు నెంబర్ 20 పరిధిలోని 44వ పోలింగ్ కేంద్రంలో 96.3% పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా 22వ వార్డు 47వ పోలింగ్ కేంద్రంలో 66.98% పోలింగ్ నమోదు జరిగింది. ఈ నెల 13వ తేదీన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శి మహిళా కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు భారీ బందోబస్తు చేపట్టడంతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.సజావుగా ఏదులాపురం మున్సిపల్ పోలింగ్.. 85.35% నమోదు అయింది.

## కేవైసీ పూర్తి చేయండి



**దమ్మపేట, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** ప్రతి ఖాతాదారుడు తన బ్యాంకు ఖాతా నిర్వహణకు కేవైసీ,సికేవైసీ,రీ--కేవైసీ ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దమ్మపేట శాఖ మేనేజర్ కే. సుధాకర్ తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్,రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దమ్మపేట మండలంలోని పెద్ద గొల్లగూడెం, మందలపల్లి పంచాయతీ కార్యాలయాల్లో కేవైసీ నవీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతా తెరవడం మాత్రమే కాకుండా ఖాతా వివరాలను సమయానుకూలంగా నవీకరించడం కూడా అత్యంత అవసరమన్నారు.కేవైసీ పూర్తి చేయకపోతే భవిష్యత్తులో లావాదేవీలలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని సూచించారు.ఖాతాదారుల వివరాలు సరిచేసి నవీకరించడంతో భద్రత పెరుగుతుందన్నారు. అరవై సంవత్సరాల లోపు ఉన్న ఖాతాదారులు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో చేరాలని కోరారు.ఈ పథకాల ద్వారా కుటుంబాలకు ఆర్థిక రక్షణ లభిస్తుందని తెలిపారు.డిజిటల్ లావాదేవీల వినియోగం,సైబర్ మోసాల నివారణపై కూడా అవగాహన కల్పించారు.అనుమానాస్పద సందేశాలు,దూరవాణి కాల్స్,గుప్త సంకేత సంఖ్యలు పంచుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, తపాలా శాఖ ప్రతినిధి శ్రావ్య,ఆర్థిక అక్షరాస్యత సలహాదారు వెంకటేశ్వరరావు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపల్‌లో ప్రశాంతంగా పోలింగ్



**శామీర్‌పేట్, జనవరి 11 (జనం సాక్షి) :** అలియాబాద్, మూడు చింతలపల్లిలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతగా ముగిసాయి.అలియాబాద్ మున్సిపల్‌లో 79.62, మూడు చింతల పల్లిలో 89.07 శాతం పోలింగ్ నమోదు అయ్యిందని అధికారులు పేర్కొన్నారు.అలియాబాద్ మున్సి పల్ పరిధిలోని లాలగడి మలక్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ సందర్శించారు. సున్నితమైన ప్రాంతం కావడంతో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఉదయం నుంచి పోలింగ్ ప్రశాంతంగా కొనసాగు తోందని ఆయన తెలిపారు. ఒక పోలింగ్ స్టేషన్ లో 1900 ఓట్లు ఉన్నాయి.2 వార్డులకు సంబంధించి 4 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేశారు.ఉదయం 10.30 గంటల వరకు సుమారు 20 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ రమేష్ పేర్కొన్నారు. ఓటర్లు నిర్భయంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రమేష్ కోరారు.

## రికార్డు స్థాయిలో పోలింగ్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేట్, మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 83.99 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు ముందస్తుగా విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. సమస్యాత్మక, సున్నిత పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి దశను కట్టుదిట్టంగా అమలు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూములకు తరలించినట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీ సమక్షంలో కలెక్టర్ పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచినట్లు వెల్లడించారు. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఎన్నికల సిబ్బంది, పోలీస్ శాఖ, వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఓటు హక్కును బాధ్యతగా వినియోగించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# పెరిగిన మదుపరుల ఆసక్తి

- మ్యూచువల్ ఫండ్లలో 'పసిడి' వెలుగులు
- జనవరిలో రూ.24,000 కోట్ల పెట్టుబడులు: యాంఫీ



**న్యూఢిల్లీ:**దేశీయ మ్యూచువల్ ఫండ్ రంగంలో మునుపెన్నడూ లేని విధంగా పసిడి ఫండ్లలోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ ఏడాది జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్ విభాగం రికార్డు వృద్ధిని నమోదు చేసింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో, స్టాక్‌మార్కెట్‌లో ఊగిసలాటలు నెలకొనడంతో, మదుపరులు పసిడిని సురక్షితమైన పెట్టుబడి మార్గంగా ఎంచుకున్నారని స్పష్టమవుతోంది.గత నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి ఏకంగా రూ.24,039.96 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. 2025 డిసెంబరులో వచ్చిన రూ.11,647 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఈమొత్తం 106% అధికం. వార్షిక ప్రాతిపదికన చూస్తే.. 2025 జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.3,751 కోట్లు మాత్రమే. దీంతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా 540% వృద్ధిని నమోదు చేసింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి జనవరిలో వచ్చిన నికర పెట్టుబడులు రూ.24,028 కోట్ల కంటే, పసిడి ఈటీఎఫ్‌ల్లోకి ఎక్కువగా రావడం విశేషం. వెండి ఈటీఎఫ్‌ల్లోకీ పెట్టుబడులు అధికంగానే వచ్చాయి. దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ జనవరి చివరికి మరో మైలురాయిని చేరింది. పరిశ్రమ నికర నిర్వహణ ఆస్తులు (నెట్ ఏయూఎం) రూ.81,01,305.58 కోట్లకు చేరాయి. 2025 డిసెంబరులో ఈ మొత్తం రూ.80,23,378.99 కోట్లుగా ఉంది. జనవరి నెలలో సగటు నిర్వహణ ఆస్తులు (ఏఏయూఎం) రూ.82,01,174.62 కోట్లుగా నమోదయ్యాయి. మ్యూచువల్ ఫండ్ ఖాతాల (ఫోలియో) సంఖ్య భారీగా పెరిగింది. జనవరిలో జతచేరిన 50.6 లక్షల ఫోలియోలతో కలిపి, మొత్తం ఫోలియోల సంఖ్య 26,63,13,561కు చేరింది. ఇందులో రిటెయిల్ మ్యూచువల్ ఫండ్ ఫోలియోలు 20.43 కోట్లుగా ఉన్నాయి. రిటెయిల్ విభాగం ఆస్తుల విలువ రూ.46,48,915 కోట్లుగా నమోదైంది.క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా వస్తున్న పెట్టుబడులు స్థిరంగా కొనసాగుతున్నాయి. జనవరిలో సిప్‌ల నుంచి రూ.31,002.33 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2025 జనవరి నాటి రూ.26,400 కోట్లతో పోలిస్తే, ఇది 17% అధికం. మొత్తం మ్యూచువల్ ఫండ్లలో సిప్ వాటా 20.2 శాతంగా ఉంది. ప్రస్తుతం ఈ ఖాతాల సంఖ్య 9.92 కోట్లకు పైగా ఉంది. 2021 మార్చి నుంచి వరుసగా 59 నెలలోనూ ఈక్విటీ స్కీముల్లోకి సానుకూల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం రూ.24,028.59 కోట్లలో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లు అత్యధికంగా రూ.7,672.36 కోట్లను ఆకర్షించాయి. పన్ను ఆదాకు ఉపయోగించే ఈఎల్ఎస్ఎస్ పథకాల నుంచి మదుపరులు రూ.593.69 కోట్లను వెనక్కి తీసుకున్నారు. జనవరిలో మొత్తం 12 కొత్త పథకాలు రాగా, వీటి ద్వారా రూ.1,939 కోట్లు సమకూరాయి. ఎస్ఐఎఫ్ (స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫండ్) ఆస్తులు రూ.6,564 కోట్లకు చేరాయి. ఇందులోకి గత నెలలో రూ.1,729 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ సందర్భంగా యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని మాట్లాడుతూ.. 'ప్రపంచ అనిశ్చితులు, స్వల్పకాలిక మార్కెట్ ఒడిదుడుకులున్నా, భారత మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ స్థిరమైన వృద్ధితో సాగుతోంది. హైబ్రిడ్, మల్టీ అసెట్, పాసివ్ ఫండ్లతో పాటు, బంగారం, వెండి ఈటీఎఫ్‌లలోకి వస్తున్న పెట్టుబడులు చూస్తే, మదుపరులు తమ పోర్ట్‌ఫోలియోను సమతుల్యం చేసుకుంటున్నారని తెలుస్తోంది' అని పేర్కొన్నారు.

## నికరలాభంలో 35% వృద్ధి

### అపోలో హాస్పిటల్స్ 200% డివిడెండ్

**హైదరాబాద్:** ఆరోగ్య సేవల రంగంలోని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్, డిసెంబరు త్రైమాసికంలో రూ.502 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.372 కోట్ల కంటే ఇది 35% అధికం. ఇదే సమయంలో ఆదాయం రూ.5,527 కోట్ల నుంచి 17% వృద్ధితో రూ.6,477 కోట్లకు చేరింది. కంపెనీ నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం వల్లే మార్జిన్లు పెరిగాయని సంస్థ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో ఎబిటా 27% పెరిగి రూ.967 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో ఆదాయం రూ.18,623 కోట్లు, నికర లాభం రూ.1,412 కోట్లుగా ఉన్నాయి. బలమైన ఫలితాల నేపథ్యంలో కంపెనీ రూ.5 ముఖ విలువ ఉన్న ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.10 (200%) చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు రికార్డు తేదీగా ఈనెల 16ను నిర్ణయించింది.అపోలో హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి స్పందిస్తూ.. 'రోగి భద్రత, నాణ్యమైన వైద్యంపై శ్రద్ధ చూపిస్తున్నాం. అందుకు ఈ ఫలితాలే నిదర్శనం. పుణేలో కొత్త ఆసుపత్రి, చెన్నైలో పార్కిన్సన్ చికిత్స కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశామ'ని పేర్కొన్నారు.

## ఈవీ రంగంలో నాయకత్వం సాధించాలి

### ప్రపంచ ప్రమాణాలను నిర్దేశించాలి

### కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి కుమారస్వామి

దిల్లీ: విద్యుత్ వాహన రంగంలో నాయకత్వ స్థానానికి ఎదిగి, ప్రపంచ ప్రమాణాలను నిర్దేశించడమే లక్ష్యంగా మన దేశం ముందుకెళుతోందని భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మంగళవారం వెల్లడించారు. 5వ గ్లోబల్ ఎలక్ట్రిఫికేషన్ మొబిలిటీ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలను స్థాపించడం, యువతకు స్థిరమైన జీవనోపాధి సృష్టించడంపై ఎక్కువగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ వాహన రంగంలో వినియోగం నుంచి తయారీలో నాయకత్వం వరకు, భాగస్వామ్యం నుంచి ప్రభావం చూపడానికి వెళ్లడమే మన దేశ దార్శనికత అని తెలిపారు. విద్యుత్ మొబిలిటీకి మారడం అనేది పర్యావరణ పరంగా తప్పనిసరి మాత్రమే కాదని, భారీ ఆర్థిక అవకాశం కూడా అని మంత్రి వివరించారు.2024-25లో విద్యుత్ వాహనాల విపణి 60 శాతానికి పైగా వార్షిక వృద్ధి రేటును నమోదు చేసిందని, విద్యుత్ వాహనాల రిజిస్ట్రేషన్లు 20 లక్షలకు చేరుకున్నాయని కుమారస్వామి పేర్కొన్నారు. 2070 నాటికి నికర శూన్య ఉద్గారాలను సాధించేందుకు, విద్యుత్ వాహనాలకు మారడం కీలకమన్నారు. ఇంధన భద్రత, పారిశ్రామిక పరివర్తనకూ ఇది దోహదం చేస్తుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 70,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద రూ.2,000 కోట్లు కేటాయించిందన్నారు.ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ గనుల సంస్థ ఎన్ఎండీసీ, ఇనుప ఖనిజం ధరలను సవరించింది. బైలా లంప్ ధరను టన్నుకు రూ.4,600 నుంచి రూ.4,700కు చేర్చింది. బైలా ఫైన్స్ టన్ను ధరను రూ.3,900 నుంచి రూ.4,000 కు పెంచింది. కొత్త ధరలు ఈనెల 10 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపింది.

## వాహనాల రిటెయిల్ అమ్మకాలు 18% పెరిగాయ్

### రాబోయే 3 నెలలపైనా డీలర్లు ఆశావహం: ఫాడా



దిల్లీ: జనవరిలో వాహనాల రిటెయిల్ విక్రయాలు 18% పెరిగి 27,22,558కు చేరినట్లు వాహన డీలర్ల సమాఖ్య (ఫాడా) తెలిపింది. 2025 జనవరిలో 23,14,940 వాహనాలను డీలర్లు విక్రయించారు. జీఎస్‌టీ రేట్ల కోత, గ్రామీణ ప్రాంతాల నుంచి గిరాకీ పెరగడం లాంటివి ఈసారి విక్రయాలు పెరిగేందుకు ఉపకరించాయని, రాబోయే 3 నెలల్లో కూడా వాహన విక్రయాలు ఆశావహంగా ఉండొచ్చని ఫాడా పేర్కొంది. మౌలిక, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా బడ్జెట్లో ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే చర్యలను ప్రతిపాదించడం, జీఎస్‌టీ రేట్ల కోత సానుకూలతలు కొనసాగుతుండటం, తక్కువ స్థాయిల్లో రుణ రేట్లు ఉండటమే ఇందుకు కారణమని విశ్లేషించింది. కార్లు, వ్యాన్లు, ఎస్‌యూవీల లాంటి ప్రయాణికుల వాహనాల (పీవీల) విక్రయాలు 4,78,915 నుంచి 7% పెరిగి 5,13,475కు చేరాయి. మెట్రోయేతర నగరాలు- గ్రామీణ ప్రాంతాల్లో పీవీ విక్రయాల్లో 14.45% వృద్ధి ఉంది. పట్టణ ప్రాంతాల్లో నమోదైన 2.75% వృద్ధి కంటే ఇది చాలా ఎక్కువ. ద్విచక్ర వాహనాల విక్రయాలు 21% పెరిగి 18,52,870 గా నమోదయ్యాయి. త్రిచక్ర వాహనాలు, వాణిజ్య వాహనాల విక్రయాలు వరుసగా 19%, 15% చొప్పున పెరిగాయి. ట్రాక్టర్ల అమ్మకాలు 23% పెరిగి 1,14,759కు చేరాయి.


## ఏఐతో సృష్టించినట్లు తెలియపరచాలి

### ఈనెల 20 నుంచి నూతన నిబంధనల అమలు


**న్యూఢిల్లీ:**కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు సృష్టిస్తుండటం, ప్రముఖుల ఫొటోలు/వీడియోలను డీప్‌ఫేక్ సాంకేతికతతో మార్పులు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తుండటంపై ఇటీవల ఆందోళన పెరుగుతోంది. అందుకే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో ఇలాంటి కంటెంట్‌ను కట్టడి చేసేందుకు ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది.




ఇందుకుగాను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు- 2021లో చేసిన సవరణలను ప్రభుత్వం నోటిఫై చేసింది. 2026 ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఏఐతో రూపొందించి, సామాజిక మాధ్యమాలకు అప్‌లోడ్ చేసే కంటెంట్ విషయంలో, ఆ విషయాన్ని స్పష్టంగా ప్రదర్శించాలి. ఏఐ సాయంతో సృష్టించిన ఫొటోలు, వీడియోలు, సమాచారం, డీఫ్‌పేక్ కంటెంట్‌పై కోర్టులు లేదా సంబంధిత అధికారులు అభ్యంతరాలు లేవనెత్తితే, 3 గంటల్లోగా వాటిని తొలగించాల్సి ఉంటుంది. పాక్షిక లేదా పూర్తి నగ్న ఫొటోలు, వీడియోలు లేదా శృంగార సంబంధిత కంటెంట్ విషయంలో 2 గంటల్లోపే స్పందించి, వాటిని తొలగించాల్సి ఉంటుంది.




# డిజిటల్ సేవల పన్నులు లేనట్లేనా?




**న్యూఢిల్లీ:**భారత్ రద్దు చేస్తుందని అంటున్న అమెరికా అధికార ప్రకటనలో స్పష్టం చేయని మన దేశం ఇటీవల కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం కింద డిజిటల్ సేవల పన్ను (డీఎస్‌టీ)ను భారత్ తొలగిస్తుందని అమెరికా ప్రకటించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన వారం రోజుల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. మన ప్రభుత్వ అధికారిక ప్రకటనలో మాత్రం ఈ విషయం లేదు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ సేవల పన్నును మనదేశం ఎలా విధించింది, ఇప్పుడు ఏ మేరకు ఉపసంహరించుకుంటుంది అనే అంశాలను చూస్తే.. వాణిజ్య ఒప్పందంపై ఫ్యాక్ట్ షీట్‌ను అమెరికా విడుదల చేసింది. డిజిటల్ సేవల పన్నులను భారత్ తొలగిస్తుందని అందులో పేర్కొంది. వివక్షపూరిత, భారమైన పన్నులను భారత్ తొలగించేలా చూసేందుకు చర్చలు జరుపుతున్నట్లూ వెల్లడించింది. ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌మిషన్స్‌పై కస్టమ్స్ సుంకాలు విధించడాన్ని నిషేధించే నిబంధనలు కూడా ఉన్నాయి. వాణిజ్య ఒప్పందంపై భారత అధికార ప్రకటనలో డిజిటల్ సేవల పన్ను తొలగింపు గురించి స్పష్టంగా ప్రస్తావించలేదు. డిజిటల్ వాణిజ్యానికి అడ్డంకులను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాత్రమే తెలిపింది. ఒప్పందంలో భాగంగా డీఎస్‌టీని తొలగించనున్నట్లు చెప్పలేదు. మనదేశం ఇప్పటికే ఈక్వలైజేషన్ పన్నులను రద్దు చేసింది.'డిజిటల్ సేవలు అందించడం ద్వారా ఒక దేశ వినియోగదారుల నుంచి విదేశీ కంపెనీలు ఆర్జించే ఆదాయంపై విధించే పన్నే' డిజిటల్ సేవల పన్ను. ఒక దేశంలో విదేశీ కంపెనీకి ఎటువంటి భౌతిక కార్యకలాపాలు లేకపోయినా, ఈ పన్ను వసూలు చేస్తారు. సాధారణంగా ఆన్‌లైన్ ప్రకటనలు, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లు, ఇతర ఇంటర్నెట్ ఆధారిత సేవల వంటి వాటిపైనే ఈ పన్నులు ఉంటాయి. ఈ పన్నుల ప్రభావం ఎక్కువగా పడిన కంపెనీల్లో గూగుల్, మెటా, అమెజాన్, ఇతర పెద్ద టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. 2016 ఫైనాన్స్ చట్టం ద్వారా భారత్ ఈక్వలైజేషన్ పన్నులను తీసుకొచ్చింది. నాన్-రెసిడెంట్ కంపెనీలతో పాటు కొన్ని డిజిటల్ లావాదేవీలపై ఈ పన్నులను విధించింది. ప్రారంభంలో భారత సంస్థలకు ఆన్‌లైన్ ప్రకటన సేవలు అందించే విదేశీ కంపెనీలపై వీటిని విధించారు. 2020 ఏప్రిల్‌లో ఇ-కామర్స్ సంస్థలు అందించే వస్తువులు, సేవలకు విస్తరించారు. మనదేశంలో విధిస్తున్న డిజిటల్ సేవల పన్నుల వల్ల, అమెరికా కంపెనీలపై భారం పడుతోందని 2021 జనవరిలో విడుదల చేసిన నివేదికలో యూఎస్‌టీఆర్ (అమెరికా వాణిజ్య ప్రతినిధి) పేర్కొంది. ఈ రంగంలోని భారత కంపెనీలకు మినహాయింపు ఇస్తూ, ఇతర దేశాల కంపెనీలపై పన్నులు విధించడం వివక్షతో కూడుకున్న చర్యగా అభివర్ణించింది. అంతర్జాతీయ పన్ను సూత్రాలకు ఇవి వ్యతిరేకమని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పన్నుల వల్ల అమెరికా సంస్థలపై ఏటా 30 మి.డాలర్లకు పైగా పన్నుల భారం పడే అవకాశం ఉందని యూఎస్‌టీఆర్ అంచనా వేసింది. అయితే భారత్ ఇప్పటికే ఈక్వలైజేషన్ పన్నులను రద్దు చేసింది. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా దేశీయ పన్ను విధానాలను తీసుకురావడం, ప్రధాన దేశాలతో వాణిజ్య ఒత్తిళ్లను తగ్గించుకునే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. పన్నుల తొలగింపుతో గూగుల్, మెటా, అమెజాన్ వంటి అమెరికా కంపెనీలు లాభపడనున్నాయి. భారత డిజిటల్ ప్రకటనల మార్కెట్‌లో ఈ కంపెనీల వాటా 65%. ఈ మార్కెట్ విలువ 5.82 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.52,000 కోట్లు). పన్నుల ఉపసంహరణతో ప్రకటనదారులపై ఎటువంటి అదనపు భారం ఉండదు, ఖర్చులు కూడా తగ్గుతాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల మార్జిన్‌లు మెరుగుపడతాయి. ఈక్వలైజేషన్ పన్నులను తొలగించినప్పటికీ.. మన దేశంలో విదేశీ డిజిటల్ సంస్థలు పన్నుల పరిధిలోనే ఉన్నాయి. 2018లో సిగ్నిఫికెంట్ ఎకనామిక్ ప్రెజెన్స్ (ఎస్ఈపీ) నియమావళిని భారత్ తీసుకొచ్చింది. తద్వారా నాన్-రెసిడెంట్ సంస్థలపై పన్నులు విధిస్తున్నారు. అదనంగా విదేశీ, దేశీయ డిజిటల్ సేవల ప్రొవైడర్లు 18% జీఎస్‌టీ చెల్లించాలి. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్, క్లౌడ్ సేవలు, సాఫ్ట్‌వేర్ సబ్‌స్క్రిప్షన్స్, ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ ప్రకటనలకు ఇది వర్తిస్తుంది. ఈ నియమావళి కింద నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, అడోబ్, మైక్రోసాఫ్ట్ 365 వంటి సేవలు ఉన్నాయి.

## ఇరాన్ నుంచి దిగుమతుల సమాచారాన్ని కోరిన అమెరికా: అదానీ


**న్యూఢిల్లీ:**ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకున్న ఆరోపణలపై, కంపెనీ నుంచి అమెరికా ఏజెన్సీ సమాచారాన్ని కోరినట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న సంస్థలతో లావాదేవీలపై దర్యాప్తులో భాగంగా, ఈనెల 4న అమెరికా ఆర్థిక శాఖకు చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఈ సమాచారాన్ని కోరినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. 2025 జూన్‌లో వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికకు సంబంధించిన చర్చల తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు ఉన్న నౌకా మార్గాల్లో ఇరాన్ నుంచి ఎల్‌పీజీను అదానీ గ్రూప్ కంపెనీలు దిగుమతి చేసుకున్నాయని నివేదిక ఆరోపించింది. ఓఎఫ్ఏసీకి పూర్తిగా సహకరిస్తున్నామని, వారు అడిగిన సమాచారాన్ని ఇవ్వనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ స్పష్టం చేసింది.

## ఇండిగోలో అదనపు పైలట్లు

దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఇండిగో, గత రెండు నెలలుగా పైలట్లు, కేబిన్ సిబ్బంది సంఖ్యను పెంచుకుంటూ వచ్చింది. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన నూతన నిబంధనల పాటింపు విషయంలో, ఇండిగోకు గత డిసెంబరులో ఇచ్చిన సడలింపుల గడువు మంగళవారం (ఫిబ్రవరి 10)తో ముగిసింది. ఈ నిబంధనలను పాటించాలంటే అదనపు పైలట్లను ఇండిగో కలిగి ఉండాలి. లేకుంటే డిసెంబరులో మాదిరి విమాన సర్వీసులకు అంతరాయం తలెత్తవచ్చు. ఈ నేపథ్యంలోనే పైలట్ల లభ్యతను ఇండిగో పెంచుకున్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. నూతన నిబంధనల పాటింపు కోసం ఫిబ్రవరి రోస్టర్ ప్రకారం ఒక విమానానికి సగటున 7.2 పైలట్ల బృందం ఉండగా.. జనవరిలో ఈ సంఖ్య 7.1గా ఉంది. డిసెంబరులో ఒక విమానానికి 6 పైలట్ల బృందమే ఉంది. రాబోయే 3 నెలల్లో ప్రతి నెలా 20 మంది పైలట్లకు, రెండు నెలలకోసారి 75 మంది ఫస్ట్ ఆఫీసర్లకు శిక్షణ ఇవ్వాలని ఇండిగో భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 10 తర్వాత మా కార్యకలాపాలకు 2,280 మంది పైలట్లు అవసరం పడొచ్చని అంచనా వేయగా.. 2,400 మంది ఉన్నారని, ఫస్ట్ ఆఫీసర్స్ కూడా అంచనాకు మించి 2,240 మంది ఉన్నారని డీజీసీఏకు ఇండిగో తెలిపింది.

## స్వల్పంగా తగ్గిన నిరుద్యోగ రేటు

ఢిల్లీ: గత ఏడాది అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో దేశ నిరుద్యోగ రేటు స్వల్పంగా తగ్గి 6.7 శాతంగా నమోదైంది. నగరాల్లో 15 ఏళ్ల పైబడిన వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు, జులై-సెప్టెంబరులో 6.9 శాతంగా ఉంది. పట్టణ ప్రాంత పురుషుల్లో నిరుద్యోగం 6.2% నుంచి 5.9 శాతానికి పరిమితం కావడం ఇందుకు దోహదపడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.4% నుంచి 4 శాతానికి చేరినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన త్రైమాసిక పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే తెలిపింది.



## హామీ లేని రుణాల పరిమితి రెట్టింపు

### పట్టణ సహకార బ్యాంకులకు వెసులుబాటు

### ప్రతిపాదించిన ఆర్‌బీఐ



**ముంబయి:** పట్టణ సహకార బ్యాంకులు (యూసీబీ) మంజూరు చేసే హామీ లేని రుణాల పరిమితిని పెంచాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం మొత్తం ఆస్తుల్లో 10 శాతంగా ఉన్న ఈ రుణాల పరిమితిని, 20 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ఈ మేరకు నిబంధనల సవరణ కోసం ముసాయిదాను మంగళవారం విడుదల చేసింది. నియంత్రిత సంస్థలు, వాటాదారులు, ప్రజలు ఈ ముసాయిదాపై మార్చి 4లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాలి. పరిమితికి మించి ఇచ్చే అదనపు హామీ లేని రుణాలను, కేవలం ప్రాధాన్య రంగాల్లో అర్హత కలిగిన వాటికే ఇస్తారు. ఒకరికి రూ.50,000 కు మించి ఇవ్వకూడదు. సభ్యులకు గృహోపకరణాల కొనుగోలు కోసం ఇచ్చే రుణ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచనున్నారు. మూడు, నాలుగో శ్రేణి పట్టణ సహకార బ్యాంకులకు సంబంధించి, గృహ రుణాల కాలపరిమితి మారటోరియం నిబంధనలపై నియంత్రణలను తొలగించాలని ప్రతిపాదించింది.

## స్కూల్‌లో నరమేధం

### థాయిలాండ్‌లో దుండగుడి కాల్పుల్లో 34మంది మృతి

### మృతుల్లో 22మంది చిన్నారులు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి11(జనంసాక్షి):దక్షిణ థాయి లాండ్ లో ఘోరం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సోంగ్ఖా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశా లలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. నిందితుడు జరిపిన కాల్పుల్లో 22మంది చిన్నారులు సహా 34మంది మరణించారు. చాలా మందిని అతను బందీలుగా చేసుకున్నాడు. పాఠశాలలో కాల్పుల మోత వినపడగానే రోడ్డుపై జనాలు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల లోపల చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హాట్ యాయ్ పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. సాయుధుడితో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తికి 18 ఏళ్ల వయసు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల లోపల ఉన్న బందీలను సురక్షితంగా విడిపించేందుకు భద్రతా దళాలు ప్రస్తుతం ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అయితే తరవాత అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమచారం.

## అవును.. ఎప్‌స్టీన్ ద్వీపాన్ని సందర్శించాను : అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్



ప్రపంచ వ్యాప్తంగా ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు పుట్టిస్తున్న వేళ.. అమెరికా వాణిజ్య మంత్రి హూవార్డ్ లుట్నిక్ అతడి ద్వీపాన్ని సందర్శించినట్లు అంగీకరించారు. తాజాగా అమెరికా కాంగ్రెస్ ఎదుట విచారణకు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. తాను ఎప్‌స్టీన్‌తో కలిసి అతడి ప్రైవేటు ద్వీపంలో లంచ్ చేసినట్లు తెలిపారు. గతంలో మాత్రం తాను ఎప్పుడో ఎప్‌స్టీన్‌తో సంబంధాలు తెగదెంపులు చేసుకున్నట్లు ఆయన బుకాయించారు. "నేను ఓ పడవలో ఫ్యామిలీ వెకేషన్‌కు వెళుతున్న సమయంలో.. అతడితో కలిసి భోజనం చేశాను. ఆ సమయంలో నా భార్య నాతోనే ఉంది. అంతేకాదు.. నా పిల్లలు, వారిని చూసుకునే ఆయాలు అక్కడే ఉన్నారు. ఓ గంటపాటు ద్వీపంలో ఉండి లంచ్ చేశాం. అది నిజం. కానీ, ఎందుకు అక్కడికి వెళ్లామో గుర్తులేదు" అని అని లుట్నిక్ పేర్కొన్నారు. అంతేకాదు 14 ఏళ్ల వ్యవధిలో మూడు సార్లు అతడిని కలిసినట్లు.. 10 ఈ-మెయిల్ సంభాషణలు జరిగినట్లు కూడా అంగీకరించారు. ఇటీవల అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన ఫైల్స్ ప్రకారం 2012 డిసెంబర్ 23న లుట్నిక్ ఎప్‌స్టీన్ ద్వీపం లిటిల్ సెయింట్ జేమ్స్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం లుట్నిక్ భార్య ఎప్‌స్టీన్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి తమ బోటు నిలిపేందుకు ఏర్పాట్లు చేయాలని కోరినట్లు ఈ-మెయిల్స్ ద్వారా వెల్లడైంది.

# ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి గోదావరిఖని విట్టల్‌నగర్ ఏరియాకు చెందిన తుండ్ల రోహిత్ (25) బుధవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం గతంలో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి అప్పులపాలయ్యాడు. రోహిత్ తల్లిని అప్పులు తీర్చేందుకు డబ్బులు కావాలని అడగగా దాదాపు రూ.5లక్షల వరకు ఇచ్చింది.అప్పుల వివరాలు అడగగా ఏమీ తెలియదని మృతుడు వివరాలు తెలుపలేదు.గతంలో రెండుమూడు సార్లు అప్పులు ఎక్కువగా ఉన్నాయని చనిపోతానని మృతుడు బెదిరించాడు.నిన్న సాయంత్రం తల్లి ఇంటి వద్ద ఉన్నదని మంగళవారం రాత్రి విట్టల్‌నగర్‌లో వేరే ఇంటిలో ఉంటున్న ఆమె తల్లి వద్దకు వెళ్లింది.రాత్రి బేకరీ పనులు చేసుకుని ఇంటికి వచ్చిన మృతుడు రాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది తన తల్లి చీరతో ఇంటి పైకప్పుకు ఇనుపరాడ్డుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.బుధవారం తెల్లవారుజామున తల్లి ఇంటికి వచ్చి తలుపులు కొట్టగా మృతుడు తలుపులు తెరవకపోయేసరికి ఇంటి పక్కవారు గడ్డం సురేష్ అనునతని సహాయంతో తలుపులు తెరిచిచూడగా రోహిత్ ఉరికి వేలాడుతూ చనిపోయి ఉన్నాడు.మృతుని తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సంజీవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

### ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే

# మిట్రల్ వాల్వ్ లీకేజీ చికిత్స సాధ్యం

- 72 ఏళ్ల వృద్ధురాలికి విజయవంత చికిత్స : మెడికవర్ వైద్యులు
- కాథెటర్ ద్వారా మినిమల్ ఇన్వేసివ్ పద్ధతి
- వృద్ధుల్లో ఆయాసం, అలసటను వయస్సు కారణంగా నిర్లక్ష్యం చేయవద్దు
- మల్టీడిసిప్లినరీ హార్ట్ టీమ్ సమిష్టి నిర్ణయంతో సురక్షిత చికిత్స



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** వృద్ధాప్యంలో గుండె ఆపరేషన్ ప్రమాదకరమనే భయాన్ని చెదరగొట్టుతూ.. ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే 72 ఏళ్ల వృద్ధురాలికి మిట్రల్ వాల్వ్ లీకేజీపై విజయవంతంగా చికిత్స అందించినట్లు సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో డైరెక్టర్--స్ట్రక్చరల్ హార్ట్ డిసీజ్ & అడ్వాన్స్డ్ కోరనరీ ఇంటర్వెన్షన్స్ డా. ప్రమోద్ కుమార్ కుచులకంటి చికిత్స వివరాలు వెల్లడించారు. కొన్ని నెలలుగా రోగికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చిన్న పని చేసినా ఆయాసం, తీవ్ర అలసట వంటి సమస్యలు ఉండేవి. మొదట వీటిని వయస్సు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేశారు. అయితే పరిస్థితి విషమించి గుండె వైఫల్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. పరీక్షల్లో మిట్రల్ వాల్వ్‌లో తీవ్రమైన లీకేజీ ఉన్నట్లు గుర్తించారు. ఆమె వయస్సు, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ హార్ట్ సర్జరీ ప్రమాదకరమని భావించిన మల్టీడిసిప్లినరీ హార్ట్ టీమ్.. డా. సాగర్ చంద్రశేఖర్ భుయార్, డా. ఎన్. శివ ప్రసాద్ నాయుడు, డా. అమరేంద్ర కుమార్ సింగ్, డా. పర్వత్రాజ్ వరుణ్ గౌతమ్, డా. సుబ్రహ్మణ్యం సమన్వయంతో కాథెటర్ ద్వారా మినిమల్ ఇన్వేసివ్ పద్ధతిలో చికిత్స నిర్వహించారు. కాలి రక్తనాళం ద్వారా చిన్న ట్యూబ్ పంపించి ఆధునిక ఇమేజింగ్ సాయంతో వాల్వ్ లీకేజీని తగ్గించామని వైద్యులు తెలిపారు. వృద్ధుల్లో కనిపించే ఆయాసం, అలసటను కేవలం వయస్సు కారణంగా భావించకూడదని సూచించారు. సకాలంలో పరీక్షలు చేయించుకుంటే ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఆధునిక పద్ధతుల్లో సురక్షితంగా చికిత్స చేయవచ్చని పేర్కొన్నారు. హార్ట్ టీమ్ సమిష్టి నిర్ణయం వల్ల ప్రతి రోగికి తగిన చికిత్స ఎంపిక సాధ్యమవుతుందని వివరించారు.

# సమ్మెకు దూరంగా జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్‌లు




**రామగిరి ఫిబ్రవరి 11 (జనం సాక్షి):** సింగరేణి సంస్థలో తమపై యూనియన్లు అవలంబిస్తున్న తీరుకు నిరసనగా అన్ని ఏరియాల్లో జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్లు సమ్మెకు దూరంగా ఉన్నట్లు తెలిపారు. చాలా సంవత్సరాలుగా జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్లు తమ గ్రేడ్ ను పెంచాలని ఎన్నో దరఖాస్తులు ఇచ్చిన కూడా ఎటువంటి ఫలితం లేదని, యూనియన్లు కూడా తమను పట్టించుకోలేదని తెలిపారు. పలుమార్లు యూనియన్ ఆఫీసుల చుట్టూ తిరిగిన కూడా ఏ-యూనియన్ నాయకుడు తమ గోడు వినిపించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అన్ని సంఘాలు ఇచ్చిన సమ్మెకు దూరంగా ఉంటున్నామని జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ లు ప్రకటించారు

# ప్రగతినగర్ చెరువు ప్రగతి

### హైడ్రా ఫెన్సింగ్‌తో చెత్త డంపింగ్ నివారణ

- 1.5 కిలోమీటర్ల మేర హైడ్రా ఫెన్సింగ్
- 145 లారీల జంతు వ్యర్థాలు తొలగింపు
- ఆక్రమణలు ఖాళీ చేయించి రాకపోకలు సులభం
- చెరువు అభివృద్ధికి మురుగు నీటి డైవర్షన్, ఎస్టీపీలు కోరిక



**హైదరాబాద్, ఫిబ్రవరి 11 జనంసాక్షి :** ప్రగతినగర్ చెరువు అభివృద్ధికి హైడ్రా కృషి కొనసాగిస్తోంది. చెరువులో దుర్గంధం వెదజల్లుతున్న పూడికను ఇటీవల తొలగించిన హైడ్రా.. ఇప్పుడు చెత్త డంపింగ్ నివారించేందుకు రోడ్డు పొడవునా ఫెన్సింగ్ వేసింది. చెరువు మధ్యలో ఉన్న రోడ్డు మార్గంలో చికెన్, మాంసం, చేపల విక్రేతలతోపాటు బయటి దుకాణదారులు వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు ముందుగా పేరుకుపోయిన జంతు వ్యర్థాలను తొలగించారు. 145 లారీల వరకు చెత్తను క్లియర్ చేశారు. వ్యర్థాలు వేస్తున్న దుకాణదారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపి ఖాళీ చేయించారు. చెరువులో చెత్త పడకుండా ఉండేందుకు రోడ్డు మార్గంలో 10 మీటర్ల ఎత్తులో హైడ్రా ఫెన్సింగ్ వేశారు. 1.5 కిమీ మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వ్యర్థాలు చెరువులో పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చెరువులో మురుగునీరు కలవకుండా త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని హైడ్రా తెలిపింది. కూకట్‌పల్లి-ప్రగతినగర్‌ను కలుపుతూ చెరువు మధ్యలో వేసిన రహదారిపై ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించడంతో లక్షలాది మంది సంతోషం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఇబ్బంది తొలగి రాకపోకలు సులభమయ్యాయని, భారీ చెత్త తొలగింపుతో దుర్గంధం తగ్గిందని పేర్కొన్నారు. ఒకప్పుడు పక్షుల కిలకిలారావాలు, వలస పక్షుల విడిదితో ఆహ్లాదంగా ఉన్న ప్రగతినగర్ (అంబీర్) చెరువుకు హైడ్రా పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు కోరారు. హైడ్రా చర్యలకు మద్దతు ప్రకటించారు. మీటర్లకొద్దీ ఉన్న పూడికను తొలగించి మురుగునీరు కలవకుండా డైవర్ట్ చేయడం, ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని, నగరంలో ఇతర చోట్ల చేసినట్టు ప్రగతినగర్ చెరువు రూపురేఖలు మార్చాలని విజ్ఞప్తి చేశారు.




# కబ్జారాయుళ్లపై హైడ్రా యాక్షన్

### ఖానామెట్‌లో 5 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్

- రూ. 1003 కోట్ల విలువైన ప్రభుత్వ భూమని కాపాడిన హైడ్రా
- ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా చర్యలు
- కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో క్షేత్రస్థాయి పరిశీలన

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 జనంసాక్షి :** జూబ్లీహిల్స్... అక్కడ గజం స్థలం రూ. 2 లక్షలు. అలాంటి ప్రాంతంలో పార్కును 150 గజాల మేర కబ్జా చేశాడో ప్రబుద్ధుడు. ఏకంగా రూ. 3 కోట్ల విలువైన భూమిని సొంతం చేసుకోవాలనుకున్నాడు. అలాగే హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు చేరువలోని ఖానామెట్ ప్రాంతం. అక్కడ ఎకరం రూ. 200ల కోట్లు. 5 ఎకరాలను వెలమ సంఘానికి గతంలో ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమి విలువ రూ. 1000 కోట్లు ఉంటుందని అంచనా.. ఆ కేటాయింపులపై కొంతమంది అభ్యంతరం చెప్పడంతో కోర్టు స్టే ఇచ్చింది. ఇదే అదనుగా ఆక్రమణల పర్వానికి తెరదీశారు కబ్జా రాయుళ్లు. ఈ రెండు కబ్జాలపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులందాయి. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా అధికారులు పరిశీలించారు. కబ్జాలను నిర్ధారించుకుని బుధవారం ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేశారు. ఇలా మొత్తం రూ. 1003 కోట్ల ప్రభుత్వ ఆస్తిని హైడ్రా కాపాడింది. ఆ కబ్జాల వివరాలు ఇలా ఉన్నాయి..

**కబ్జా చేసిన కిరాయిదారుడు**

జూబ్లీహిల్స్.. అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఇళ్ల మధ్య దాదాపు 2 ఎకరాల మేర పార్కు ఉంది. అక్కడ ఓ ఇంటిని కిరాయికి తీసుకుని లేడీస్ హాస్టల్ నడుపుతున్న వ్యక్తికి.. ఆ పార్కు స్థలంపై కన్ను పడింది. ఇంకేముంది 150 గజాల మేర పార్కును ఆక్రమించేశాడు. కాంపౌండ్ దాటి పార్కులోకి 50 గజాల మేర జరిగి పాత భవనానికి ఆనుకుని మరో నిర్మాణం చేపట్టాడు. ఒక్కో అంతస్తులో 4 బెడ్లు పట్టినట్టు గదులు నిర్మించాడు. ఇంటి యజమాని కూడా ఈ కబ్జాలపై మౌనంగా ఉన్నాడు. పార్కు వైపు గేటు పెట్టి 100 గజాల మేర ఫార్మ్ హౌస్ మాదిరి సొంత పార్కును అభివృద్ధి చేసుకుని వాడుకుంటున్నాడు. అక్కడ చుట్టుపక్కల నివాసితులు ఊరుకోలేదు. పార్కు కబ్జాపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని హైడ్రా ప్రజావాణిలో అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కులోకి 50 గజాల మేర జరిగి నిర్మాణం చేపట్టినట్టు నిర్ధారించుకుంది. మరో 100 గజాల మేర హద్దులు వేసుకుని ఆక్రమణ చేసినట్టు స్పష్టం చేసుకుంది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాలతో బుధవారం 3 అంతస్తుల నిర్మాణాన్ని తొలగించారు. పార్కు కబ్జా ప్రయత్నాలకు ఫుల్ స్టాప్ పెట్టి ఫెన్సింగ్ వేశారు. కబ్జాకు పాల్పడినవారిపై పోలీసు స్టేషన్లో కేసు పెట్టారు.

### ఖానామెట్‌లో 5 ఎకరాలను కాపాడిన హైడ్రా


హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు సమీపంలోని ఖానామెట్‌లో ఆల్ ఇండియా వెలమ సంఘానికి 5ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలం చుట్టూ ప్రీకాస్ట్ వాల్‌తో ప్రహరీ నిర్మిస్తుండగానే.. కుల సంఘాలకు స్థలాలు కేటాయించడంపై కొంతమంది కోర్టుకెక్కడంతో హైకోర్టు స్టే ఇచ్చింది. ఇదే అదనుగా ఆ స్థలాన్ని వెనుక వైపు నుంచి అక్కడ ఉన్న స్థానికులు మట్టిపోస్తూ కబ్జాచేస్తున్నారని.. అదేమని అడిగితే వాచ్‌మ్యాన్‌పై దాడి చేస్తున్నారని ఆ సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పును బట్టి నిర్ణయం ఉంటుంది.. ఈ లోగా అక్కడి స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని హైడ్రాను కోరారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి కబ్జాలకు ఆస్కారం లేకుండా 5 ఎకరాల మేర ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది.

# దమ్మన్నపేట ఆదర్శ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

**గంభీరావుపేట ఫిబ్రవరి 11 (జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు ఆరవ తరగతికి వంద సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి ఉన్నవారు ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 28 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు

# నారాయణపేట జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రశాంతంగా పోలింగ్

- ఓవరాల్ పోలింగ్ 74.04 శాతం నమోదు
- మద్దూరులో అత్యధికంగా 79 శాతం.. మక్తల్‌లో అత్యల్పంగా 70.20 శాతం
- మొత్తం 90,301 మంది ఓటర్లలో 66,859 మంది ఓటు హక్కు వినియోగం
- వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ.. గట్టి భద్రత



**మున్సిపాలిటీల వారీగా పోలింగ్ శాతం**

| మున్సిపాలిటీ | పోలింగ్ శాతం |
|---|---|
| నారాయణపేట | 74.18% |
| కోస్గి | 74.83% |
| మక్తల్ | 70.20% |
| మద్దూరు | 79.00% |
| మొత్తం | 74.04% |

**నారాయణపేట, ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలోని నారాయణపేట, కోస్గి, మక్తల్, మద్దూరు మున్సిపా లిటీలలోని 71 వార్డులకు బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసి ంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఓటింగ్‌లో ఓవరాల్ 74.04 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా మద్దూరులో 79 శాతం, అత్యల్పంగా మక్తల్‌లో 70.20 శాతం పోలింగ్ నమోదైంది. నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం 90,301 మంది ఓటర్లలో 66,859 మంది (పురుషులు 32,994, మహిళలు 33,864) ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ సజావుగా, ప్రశాంతంగా ముగించాలని స్పెషల్ అధికారులకు సూచించారు.

జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మి నారాయణపేట మున్సిపాలి టీలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లోని 19వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడి సరళి ఆరా తీశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ నేతృత్వంలో డీఎస్పీ నల్లపు లింగయ్య ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

# చొప్పదండిలో ఓటు వేసేందుకు బార్లు తీరిన ఓటర్లు





- చొప్పదండిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న సీపీ గౌస్ అలాం
- ప్రశాంతంగా పోలింగ్

**చొప్పదండి, ఫిబ్రవరి 11 (జనం సాక్షి):** చొప్పదండి పురపాలక సంఘంలోని 14 వార్డుల అభ్యర్థులు ఎన్నికకు బుధవారం నిర్వహించిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 14 వార్డుల అభ్యర్థుల ఎన్నికకు వార్డుల వారీగా విభజన చేసి ఐదు పోలింగ్ కేంద్రాలలో ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలలో పోలింగ్ సరళిని జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ అలాం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్, చొప్పదండి, జమ్మికుంట, హుజరాబాద్, హుస్నాబాద్ మున్సిపల్‌లో బుధవారం జరిగే ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగిందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. చొప్పదండి పట్టణంలో 85%కు పైగా పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు సిఐ ప్రదీప్ కుమార్, ఎస్సైలు నరేష్ రెడ్డి, వంశీకృష్ణలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# దొంగ ఓట్లు వేసిన, వేయించిన వారిపై ఈసి చర్యలు తీసుకోదా?

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి టౌన్ ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** ఎన్నికల విధులకు ఆటంకం కలిగించానని తనపై కేసులు నమోదు చేయాలని ఆదేశించిన ఎలక్షన్ కమిషన్, దొంగ ఓట్లు వేసిన వారిపై, వేయించిన వారిపై చర్యలు తీసుకోదా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. గత బి ఆర్ఎస్ హయంలో సంగారెడ్డి లోని ప్రతి వార్డులో 300 దొంగ ఓట్లు నమోదు చేయించారని, ఇప్పుడు వారితో ఓట్లు వేయిస్తున్నారని ఆరోపించారు. దొంగ ఓట్లు వేయకుండా అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్త గల్లాను సీఐ శివ కుమార్ పట్టుకున్నారనీ, అందుకే అక్కడికి వెళ్లానని అన్నారు. దొంగ ఓట్లను తొలగించని ఎన్నికల కమిషన్, జిల్లా అధికారులు ఈ గొడవకు బాధ్యులు కారా అని ఆయన ప్రశ్నించారు. దొంగ ఓట్లు తొలగించడంలో ఎన్నికల కమిషన్, అధికారులు విఫలమై.. దొంగ ఓటర్లను అడ్డుకున్న తమపై కేసులు పెట్టమని ఎన్నికల కమిషన్ చెప్పడం ఎంతవరకు



కరెక్ట్ అని ఆయన అన్నారు.

# కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ చరిత్ర సృష్టిస్తుంది

- భారీ స్థాయిలో విజయదుందుభి మోగిస్తాం : వెలిచాల రాజేందర్ రావు
- అత్యధిక సీట్లతో మేయర్ పీఠం కైవసం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేయర్ పీఠం గిఫ్టు
- ప్రజలందరికీ కృతజ్ఞతలు.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గెలుపుకు బాటలు

**కరీంనగర్, ఫిబ్రవరి 11 జనంసాక్షి :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృష్టిస్తుందని, భారీ స్థాయిలో విజయ దుందుభి మోగిస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని, అత్యధిక సీట్లు గెలుచుకుని మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని పేర్కొన్నారు. మేయర్ పీఠాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిఫ్టుగా అందిస్తామని తెలిపారు.

బుధవారం క్రిస్టియన్ కాలనీలోని పోలింగ్ బూత్‌లో వెలిచాల రాజేందర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం రాజేందర్ రావు మాట్లాడుతూ.. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీచిందని, కాంగ్రెస్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో విజయం సాధించబోతున్నారని పేర్కొన్నారు.



ప్రతిపక్ష పార్టీలకు ఎదురుగాలి తప్పదని, ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ గెలుపుకు బాటలు వేశాయని తెలిపారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో పోలింగ్ సరళిని రాజేందర్ రావు పర్యవేక్షించారు. ఆయా డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులు, స్థానిక నాయకులు, ప్రతినిధుల నుంచి పోలింగ్‌కు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించిన మంత్రి కొండా సురేఖ

**శ్రీశైలం, ఫిబ్రవరి 11 జనంసాక్షి :** ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన పవిత్ర శ్రీశైలం మహాక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారిని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ప్రధాన ద్వారం వద్ద దేవస్థానం అధికారులు, వేదపండితులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల మధ్య మంత్రి సురేఖ స్వామి వారి ఆశీస్సులు పొందారు. దర్శనం అనంతరం మంత్రి రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధి, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



# మేకలపై చిరుత దాడి

**చందుర్తి (జనంసాక్షి):** మండలంలోని దేవుని తండా శివారులోని అటవీ ప్రాంత శివారులో మేకలపై చిరుత పులి బుధవారం దాడి చేసి హతమార్చినట్లు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం.... దేవుని తండాకు చెందిన నూనవత్ గోపాల్‌కు చెందిన మేకలపై చిరుత పులి దాడి చేసింది. ఈ దాడిలో ఓ మేకను తినగా, మరో రెండు మేకలను గాయపరిచిందని గోపాల్ వాపోయారు చిరుత దాడిలో గాయ పడిన మేక విలువ సుమారు రూ. 22వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. కాగా ఈ సంఘటనపై అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తండావాసులు తెలిపారు.

## సప్త సముద్రాలు దాటి వచ్చి
# ఓటు హక్కు వినియోగం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** వేములవాడలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. వేములవాడకు చెందిన ఎన్నారై కార్తికేయ,దుబాయ్ నుండి వచ్చిన బాదవేణి రోహిణి, విమల తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కార్తికేయ తన ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం అమెరికా నుంచి ప్రత్యేకంగా స్వదేశానికి చేరుకున్నారు. వేల కిలోమీటర్ల దూరం, సమయం మరియు వ్యయాన్ని లెక్కచేయకుండా స్వగ్రామానికి వచ్చి ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై తనకున్న నిబద్ధతను ఆయన చాటిచెప్పారు. 28వ వార్డులో ఓటు హక్కు వినియోగించు కోవడానికి ప్రత్యేకంగా స్వదేశానికి వచ్చినట్లు, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

దుబాయ్ నుండి వచ్చిన బాదవేణి రోహిణి విమల తమ ఓటు వేసేందుకు తమ స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నామన్నారు. ఓటు కోసం సప్త సముద్రాలు దాటి వేములవాడకు వచ్చిన వారిని పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరికి లభించిన అత్యంత విలువైన హక్కు అన్నారు. మన భవిష్యత్తును నిర్ణయించే నాయకులను ఎన్నుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విదేశాల్లో ఉన్నామనే కారణంతో మన ఓటు హక్కును వదులుకోకూడదని, అందుకే ఓటు వేయడానికి ప్రత్యేకంగా వచ్చామన్నారు. ఓటు కోసం సప్త సముద్రాలు దాటి స్వగ్రామానికి వచ్చిన వారిని స్థానికులు, మిత్రులు, బంధువులు అభినందించారు. యువతకు వారు ఆదర్శంగా నిలిచారని పలువురు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ అంత దూరం నుంచి వచ్చి ఓటు వేయడం నిజంగా అభినందనీయమని, ఇది ప్రజాస్వామ్యం పై ఆయనకున్న గౌరవాన్ని తెలియజేస్తుందన్నారు. యువత అంతా కార్తికేయను ఆదర్శంగా తీసుకుని తమ ఓటు హక్కును తప్పక వినియోగించు కోవాల న్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదనే సందేశాన్ని వారు అందరికీ తెలియజేశారు.

# రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రమే కారణం



- బండి సంజయ్ రైతులకు యూరియా అందించాల్సిన బాధ్యత నీకు లేదా?
- రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే వాటా గురించి మాట్లాడవా?
- ప్రజాస్వామ్యం గురించి గంగుల కమలాకర్ మాట్లాడటం సిగ్గుచేటు
- గంగుల కమలాకర్, బండి సంజయ్ లపై సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

**కరీంనగర్ బ్యూరో ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** రాష్ట్రంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని, యూరియా ఇవ్వకుండా మోసం చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన యూరియా వాటాను సకాలంలో అందించకుండా బిజెపి సర్కార్ మోసం చేసిందని మండిపడ్డారు. పంపవలసిన కేంద్రం వాటా నిలిపేసి, బదనాం మాత్రం రాష్ట్ర ప్రభుత్వం పై నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కు రైతులు ఓట్లు వేయలేదా? అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. యూరియా పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాష్ట్రానికి వచ్చే వాటా విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సుడా చైర్మన్ కోరారు. రైతాంగం దగ్గర రాష్ట్ర ప్రభుత్వాన్ని కావాలనే బదనాం చేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ఇదే సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, ఓటుకు పదివేల రూపాయలు ఇచ్చి కొంటున్నారని గంగుల కమలాకర్ చేసిన ఆరోపణ పైన సుడా చైర్మన్ స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది బిఆర్ఎస్ (టిఆర్ఎస్) ప్రభుత్వమే అని, విచ్చలవిడిగా టిఆర్ఎస్ హయాంలోనే డబ్బుల పంపిణీ జరిగిందని సుడా చైర్మన్ ఆరోపించారు. ఓటర్లను గంగుల కమలాకర్ అవమానిస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని బిఆర్ఎస్ కు, కాంగ్రెస్ కు మధ్య పాలనను ప్రజలు తెలుసుకున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపోల్

- చివరి వరకు ప్రలోభపెట్టిన అభ్యర్థులు
- పలు చోట్ల అభ్యర్థులు, నాయకుల వాగ్వాదాలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలలో వేములవాడలో చెదురు ముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉండగా 113 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పట్టణంలో మొత్తం 40877 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 19580, మహిళలు 21278, ఇతరులు 18 మంది ఉన్నారు. 28 వార్డులకు 58 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 20 సమస్యాత్మక, అతి సమస్యత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఉదయం నుంచి కేంద్రాలకు ఉత్సాహంగా తరలి వచ్చారు. వృద్ధులు,వికలాంగుల కోసం ప్రత్యేకంగా సిబ్బందినీ గేట్ల వద్ద ఉంచి వారికి వీల్ చైర్ లను ఏర్పాటు చేశారు. వీల్ చైర్ లలో పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లి ఓటు వేయించిన అనంతరం వాహనాల దగ్గర దిగపెట్టారు. చివరి వరకు ప్రలోభ పెట్టిన అభ్యర్థులు.. పోలింగ్ రోజున ఆఖరి నిమిషం వరకు ఓటర్లను అభ్యర్థులు ప్రలోభాలకు గురి చేశారు. ఓటర్ల ఇంటి దగ్గరకు తమ మద్దతు దారులను పంపి డబ్బులు పంపిణీ చేస్తూ పోలింగ్ కేంద్రాలకు వాహనాలు సమకూర్చడం వంటివి ఏర్పాటు చేశారు.

## మున్సిపల్ చైర్మన్ పీఠం బిఆర్ఎస్ పార్టీ కైవసం పక్కా

### భారీ మెజార్టీతో 28 కౌన్సిలర్ స్థానాలు కైవసం : మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు ఫిబ్రవరి 11 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠం కైవసం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని 36 వార్డులలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను నాయకులతో కలిసి సందర్శించారు. పోలింగ్ ఏ విధంగా జరుగుతుందని నాయకులను మరియు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన 36 కౌన్సిలర్ స్థానాల్లో సుమారు 28 కౌన్సిలర్లు విజయ ఢంక మోగిస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ ఆరచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అదేవిధంగా ప్రలోభాలకు గురిచేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని విజయం మావైపే ఉందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కనుమరుగు ఖాయమన్నారు. పైలెట్ వెంట స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

- రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**గోదావరిఖని, జనంసాక్షి :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం కార్పొరేషన్ పరిధిలో జ్యోతినగర్ టిటిఎస్ జడ్‌పిహెచ్‌ఎస్, పిటిఎస్ ఎన్టిపిసి ఎస్‌టి క్లెయిర్స్, గౌతమ్ నగర్‌లోని ప్రగతి పాఠశాల, రాంనగర్‌లోని సెక్రెట్‌హార్ట్ హైస్కూల్,అమరావతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల వరకు లక్షా 01 వేయి 470 మంది (56.49) శాతం తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 9.5%, 11 గంటలకు 24.31%, 1 గంట వరకు 42.12% పోలింగ్ నమోదైందని, 5గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను పటిష్ఠ భద్రతతో స్ట్రాంగ్ రూంకు తరలించే విధంగా ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట రామగుండం తహసిల్దార్ ఈశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వానికి సెగతగాలాలి

- సమ్మెలో కార్మిక లోకం పాల్గొనాలి
- కార్మిక సంఘాల జాయంట్ యాక్షన్ కమిటి



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జీ-3 పరిధి ఓసీపీ-1లో ఎస్అండ్‌డీ సెక్షన్..బేస్ వర్క్‌షాప్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ-నాన్ ఆపరేషన్ పిట్ సెక్రటరీ ఎనగందుల సదానందం అధ్యక్షతన బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ గేటు మీటింగ్‌కు ఐఎన్‌టీయూసీ తరపున వెంకటరాజం,పిన్నింటి రామిరెడ్డి, మహమ్మద్ అత్తరుద్దీన్, తుంగపిండి ఆనంద్, తుంగపిండి నారాయణ, కాంతాల కిషన్ రెడ్డి, మహమ్మద్ సిరాజుద్దీన్,ఎఐటీయూసీ తరపున డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు, జూపాక రామచందర్, డి.తిరుపతిరావు,నక్క రమేష్, సీఐటీయూ తరపున కొమురయ్య, ఈ.కుమార్, ప్రవీణ్ కుమార్, వేగోళపు శ్రీను, టీబీజీకేఎస్ నుండి పిట్ సెక్రటరీ పూర్ణాకర్,జిటుకు శ్రీను, శ్రీకాంత్‌రావు, చుక్కల కుమార్ పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ నుండి సదానందం మాట్లాడుతూ హక్కుల రక్షణ కోసం, ఉనికి కోసం చేస్తున్న పోరాటమన్నారు. దీనికోసం ప్రతి ఒక్క కార్మికుడు స్వచ్ఛందంగా డ్యూటీలను బహిష్కరించవలసినదిగా కార్మికులను కోరారు. కాంగ్రెస్ పాలనలో ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వందల సంఖ్యలో పరిశ్రమలను స్థాపించి వాటిని జాతికి అంకితం చేసి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే..నేటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ స్థాపించిన ప్రభుత్వ సంస్థల అన్నింటిని ప్రైవేటుపరం చేస్తూ కార్మికులపై వారి హక్కులపై ఉక్కు పాదం మోపుతు పెట్టుబడిదారీ వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. కార్మిక సోదరులందరూ ఒకతాటిపైకి వచ్చి సమ్మె సెగను ఢిల్లీకి తాకేలా చూపించాలని తెలిపారు. ఎఐటీయూసీ వైవి రావు మాట్లాడుతూ కార్మికునికి రక్షణ కవచాలైన కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ 43 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా విభజించడం దుర్మార్గమైందన్నారు. చాలీచాలని జీతాలతో బతకాల్సి ఉంటుందని. విజ్ఞులైన కార్మిక సోదరులందరూ సమ్మెలో పాల్గొనాలని సూచించారు.

# నాలుగు లేబర్ కోడ్స్‌పై అధికారుల అవగాహన



**గోదావరిఖని, జనంసాక్షి :** ఇటీవల అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సింగరేణి ఆర్‌జీ-1 జీఎం డి.లలిత్‌కుమార్ అధ్యక్షతన ఆర్‌జీ-1జీఎం కార్యాలయ సమావేశ హాలులో బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ హైదరాబాద్ రీజియన్-2 యన్.నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఆర్‌జీ-1,2,3,ఎయల్‌పి ఏరియాల జీఎంలు, ఏజంట్స్ వివిధ ఉన్నతాధికారులు, ఉద్యోగుల తో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ యన్.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉన్న 29 చట్టాలను కొత్త నాలుగు లేబర్ కోడ్స్‌గా తేదీ 21 నవంబర్ నుండి అమలుపై అవగాహన కార్యక్రమం ద్వారా అందరికీ ఉపయోగకర మైన మార్గదర్శకాలు లభిస్తాయని చెప్పారు. కార్మికుల సంక్షేమం,హక్కులు, భద్రత, వేతన నిర్మాణం,పారదర్శక ఉద్యోగ వ్యవస్థ కోసం ,కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కొత్త కోడ్స్ సరిగ్గా అర్థం చేసుకుని అమలు చేయడం అత్యంత అవసరం అని తెలిపారు. ఈ సమావేశంలో జీఎంలు డి.లలిత్ కుమార్, బండి వెంకటయ్య,నాగేశ్వరరావు,మధుసూదన్ ఆర్జీ రీజియన్ క్వాలిటి జియం సుజోయ్ మజుందర్,యస్ఓటు జియం చంద్రశేఖర్,ఏరియా ఇంజనీర్ రామమోహనరావు,ఏజంట్స్ చిలుక శ్రీనివాస్, లక్కిడి రమేష్, పివోడి రమేష్ ఆర్జీ.1,2,3 ఎయల్‌పి ఏరియాల పర్సనల్ అధికారులు,అన్ని ఏరియాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



- శ్రీశైలం వెళ్తుండగా ఆటో ట్రాక్టర్ ఢీ.. అక్కడికక్కడే మృతి
- ఏర్పుమళ్ళ గ్రామంలో విషాద ఛాయలు
- మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు

**బొంరాస్‌పేట, ఫిబ్రవరి 11 జనంసాక్షి :** మహాశివరాత్రి సమీపిస్తున్న వేళ శివమాల ధారణ ధరించి శ్రీశైల దేవస్థానం వెళ్తున్న యువకుడిని మృత్యువు కబళించింది. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన కడమంచి సత్యనారాయణ (22) బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి సమీపంలోని కోట్రా గేటు దగ్గర ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ హైదరాబాద్‌లో సొంత ఆటో నడిపి జీవనం సాగిస్తున్నాడు. శివమాల ధారణ ధరించి సొంత ఆటోలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం బయలుదేరగా ఈ దారుణ ప్రమాదం సంభవించింది. చిన్న వయసులోనే యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# రామగుండం మేయర్ పీఠం బీఆర్‌ఎస్‌దే

- కాంగ్రెస్ అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పబోతున్నారు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకుంటి చందర్



**గోదావరిఖని, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** రామగుండం మున్సిపల్ ఎన్నిక ల్లో ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తారని, మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ రామగుండం మేయర్ పీఠాన్ని సాధించ డం ఖాయమని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం 45వ డివిజన్‌లో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో గత రెండు సంవత్స రాల జరుగుతున్న కాంగ్రెస్ దుర్మార్గపు.. అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బెదిరింపులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా నామినేషన్లు విత్ డ్రా చేయించిన రామగుండం కార్పొరేషన్ ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలిచారన్నారు. తొలి సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించడం జరిగిందన్నారు.

సంక్షేమ సారధి కెసిఆర్ పాలన ప్రజలందరూ కోరుతున్నారన్నారు. రాబోవు కాలంలో తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. నాయకులు జిమ్మీబాబు, రవి తదితరులున్నారు.

## దొంగ ఓటు వేసేందుకు ప్రయత్నించిన ఇద్దరిపై కేసు నమోదు



**బోధన్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** బోధన్ పట్టణంలోని రాకాసిపేట్, గోశాలలో వేరే వారికి సంబంధించిన పత్రాలను సృష్టించి ఓటు వేయడానికి ప్రయత్నించిన ఇద్దరిపై ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బుధవారం జరిగిన బోధన మున్సిపల్ ఎన్నికలలో భాగంగా రాకాసిపేట్ లోని బూత్ నెం. 24, మరియు గోశాల ఏరియాలో బూత్ నెం. 78 లోని పోలింగ్ కేంద్రాల్లో ఇతరుల పేర్లతో ఓటు వేయడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల గుర్తింపు కార్డులను తనిఖీ చేస్తున్న సమయంలో, నిందితులు తప్పుడు గుర్తింపు పత్రాలతో ఓటు వేయడానికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న పోలింగ్ ఏజెంట్లు మరియు ఎన్నికల సిబ్బందికి అనుమానం వచ్చి వారిని విచారించగా, వారు దొంగ ఓట్లు వేయడానికి వచ్చినట్లు తేలింది. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను సదరు వ్యక్తులపై ఎన్నికల నియమావళి ప్రకారం మరియు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ స్పష్టం చేశారు.

## ఓయూలో ఘనంగా ముగిసిన
# జాతీయ సదస్సు

### కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై లోతైన చర్చలు



**సికింద్రాబాద్(జనంసాక్షి):** ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. ఈ సదస్సులో సమకాలీన భారతదేశంలో కేంద్ర--రాష్ట్ర సంబంధాల పునఃఆవిష్కరణ, నియోజకవర్గాల పునర్విభజన, ఆర్థిక సమాఖ్యవాదం, ఒకే దేశం-ఒకే ఎన్నిక మరియు డిజిటల్ గవర్నెన్స్ అనే అంశాలపట్ల లోతైన చర్చలు నిరవించారు. ఈ సదస్సు ద్వారా దేశంలో సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి సంబంధించిన పలు సిఫార్సులు వెలువడినట్లు నిర్వహకులు కాన్ఫరెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. కృష్ణ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు తెలిపారు.

మూడో రోజు జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి మణిపూర్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ తిరుపతి రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత సమాఖ్య వ్యవస్థలో కేంద్ర--రాష్ట్ర సమన్వయం ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు విధాన సమన్వయం అవసరమని ఆయన అన్నారు. అనంతరం

హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బిజు మాట్లాడుతూ.. సమకాలీన సమాఖ్య రాజకీయాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రతిపాదన, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, పాలనా సమర్థత మరియు ప్రజాస్వామ్య బాధ్యత మధ్య ఉన్న సంబంధాన్ని ఆయన వివరిస్తూ, ఈ అంశంపై శాస్త్రీయ చర్చలు కొనసాగాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ రాజనీతి శాస్త్ర విభాగం ఈ జాతీయ స్థాయి అకాడెమిక్ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. సమకాలీన రాజ్యాంగ, పాలనా అంశాలపై విశ్వవిద్యాలయ స్థాయిలో చర్చలు జరగడం సమాజానికి మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పాల్గొన్న పరిశోధకులు , అధ్యాపకులకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు, పరిశోధకులతో పాటు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ముగిసిన పోలింగ్

- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో సజావుగా పోలింగ్
- పోలింగ్ కేంద్రాల సందర్శన.. ఓటు వేసిన జిల్లా కలెక్టర్ పమేల సత్పతి
- వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ.. కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలన
- మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లకు మొక్కలు అందజేత



**కరీంనగర్, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, హుజూరా బాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లో రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ పమేల సత్పతి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ నుంచి ఎన్నికల తీరును సమీక్షించి అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రోడ్లు భవనాల శాఖ ఎస్‌ఈ కార్యాలయం, జ్యోతినగర్ ఎస్ఆర్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. సెయింట్ ఆల్ఫోన్స్ హైస్కూల్‌లోని మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి ఓటు వేసే వారికి మొక్కలు అందజేశారు. పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్లను సమీక్షించి సిబ్బందికి సూచనలు చేశారు.

అభ్యర్థుల జాబితా, ఓటర్ల క్రమ సంఖ్య పరిశీలించి ప్రక్రియ నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. డివిజన్ ఓటర్ల సంఖ్య, పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ శాతాన్ని ఫార్మాట్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. సాయంత్రం 5 గంటల్లోపు క్యూలో ఉన్నవారందరికీ ఓటు అవకాశం కల్పించాలని చెప్పారు.

రోడ్లు భవనాల శాఖ ఎస్‌ఈ కార్యాలయంలోని పోలింగ్ స్టేషన్‌లో కలెక్టర్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ కౌంటింగ్ కోసం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నికల సంఘం నియమాల ప్రకారం కౌంటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు వివరాలు ఫార్మాట్‌లో నమోదు చేయాలని సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# పోలీసుల తీరుపై జగ్గారెడ్డి ఆగ్రహం



**సంగారెడ్డి, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** పట్టణంలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న సీఐ.. 34 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గల్ల పట్టుకున్నారని ఆరోపిస్తూ సీనియర్ నేత జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామంటూ బూత్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

# పొంగులేటి వ్యాఖ్యలు సిగ్గుచేటు

- మాజీమంత్రి జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, ఫిబ్రవరి 11 (జనంసాక్షి) :** తన ఫోన్‌ను బీఆర్ఎస్ నాయకులు ట్యాపింగ్ చేస్తున్నారని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం సూర్యాపేటలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నది వారేనని అయినా హోం మంత్రి చేతకానితనమే దీనికి నిదర్శనమా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని అనడం హాస్యాస్పదమని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని మంత్రి పొంగులేటి అనడం అంటే తమది దద్దమ్మ ప్రభుత్వం అని వారు ఒప్పుకున్నట్లేనని, రాష్ట్రంలో పోలీసింగ్ లేదని, ప్రభుత్వం చేతగాని స్థితిలో ఉందని వారి మాటల్లోనే తేటతెల్లమవుతోందని విమర్శించారు. హోం మంత్రిగా ఉన్న వ్యక్తి విఫలమయ్యారని మంత్రులే పరోక్షంగా ఒప్పుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చేశారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు స్వేచ్ఛ లేకుండా పోయిందని జగదీష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తల్లా వాడుకుంటూ బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని, బీఆర్ఎస్ ఫోన్ల ట్యాపింగ్ చేస్తోందనేదనేది కేవలం అపోహ మాత్రమేనని, నిజానికి మంత్రుల ఫోన్లను కూడా ఈ ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని మేము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామన్నారు. నిజంగా ట్యాపింగ్ జరుగుతుంటే, అది ఎవరో తేల్చే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో సహకరించాలని ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం వారి బలహీనతకు నిదర్శనమన్నారు. ప్రజల్లో ఆదరణ లేక ఇప్పుడు ఉద్యోగుల వద్దకు కాళ్ల బేరానికి వెళుతున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని దాడులు చేసినా రాబోయేది మళ్లీ కేసీఆర్ రాజ్యమే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కానిస్టేబుల్‌ను నిలదీసిన బీఆర్ఎస్, బీజేపీ

- ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజుల ఆందోళన



**కామారెడ్డి, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు ప్రాంతాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా, ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీలో ఓ కానిస్టేబుల్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెట్టారు. బాన్సువాడ మున్సిపాలిటీ 9వ వార్డులో బందోబస్తు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్.. కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఓటర్లకు చెబుతుండగా అక్కడే ఉన్న బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నిలదీశారు. దాంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని జాజాల సురేందర్ ఆరోపించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై మూకుమ్మడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్నారని, ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న జాజాల సురేందర్, ఇతర బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌కు చిత్తశుద్దేదీ?

- కెసిఆర్‌పై చర్యలకు వెనకాడుతున్నారని విమర్శ
- కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు



**కరీంనగర్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎస్ఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమీపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్పు.. రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్పు.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు.

# మహా శివరాత్రికి 2243 ప్రత్యేక బస్సులు

- శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249 స్పెషల్ సర్వీసులు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా టీజీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈనెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

హైదరాబాద్లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కె.పి.హెచ్.బి, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14నుంచి 16తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 వతేది నుంచి 17 తేది వరకు(మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డ్ లను సంస్థ ఏర్పాటు చేస్తుంది.

'శివరాత్రి ఆపరేషన్స్ పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై.నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో టీజీఎస్ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లను చేస్తోంది. 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత శివరాత్రి కన్నా ఈ సారి 208 బస్సులను అదనంగా సంస్థ నడపనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు.

హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను www.tgsrtcbus.in వెబ్సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# కోర్ అర్బన్ రీజియన్ వరకు జలమండలి పునర్వ్యవస్థీకరణ

- జలమండలి ఈడీగా ఉన్న మయాంక్ మిట్టల్ జాయింట్ ఎండీగా నియామకం
- పరిధి విస్తరించడంతో కొత్త జాయింట్ ఎండీ, ముగ్గురు అధికారులను ఈడీలుగా నియమించిన ప్రభుత్వం
- గురువారం బాధ్యతల స్వీకరించిన జాయింట్ ఎండీ, ఈడీలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జలమండలి పరిధిని కోర్ అర్బన్ రీజియన్ వరకు పునర్విభజన విస్తరణలో భాగంగా జోన్లుగా సర్కిళ్లు, సర్కిళ్లుగా సబ్ డివిజన్లు, వార్డులుగా సెక్షన్లలతో విభజించడంతో జీహెచ్ఎంసీ తరహాలోనే జలమండలి కొత్త రూపు సంతరించుకుంది. ఈ పునర్వ్యవస్థీకరణ భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం జలమండలిని కొత్తగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరిలుగా మూడు జోన్లు ఏర్పాటు చేశారు. ఓ ఆర్ ఆర్ వరకు వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రస్తుతం జలమండలి ఈడీగా పని చేస్తున్న మయాంక్ మిట్టల్ ను జాయింట్ ఎండీగా నియమించిన ప్రభుత్వం.. కొత్త విభజన ప్రకారం మల్కాజిగిరి జోన్ కి పంకజ, హైదరాబాద్ జోన్ కి సామ్రాట్ అశోక్, సైబరాబాద్ జోన్ కి సంతోష్ లను నియమిస్తున్నట్లు గురువారం ఉత్వర్వులు జారీ చేసింది.

ఈ నేపథ్యంలో జలమండలిలో జాయింట్ ఎండీగా పదోన్నతి పొందిన మయాంక్ మిట్టల్ గురువారం రోజున ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితోపాటు ప్రభుత్వం ముగ్గురు ఈడీలు పంకజ, సామ్రాట్ అశోక్, సంతోష్ లను సైతం ఆయా జోన్లలో బాధ్యతలు స్వీకరించారు. **కొత్త జాయింట్ ఎండీగా** ప్రస్తుతం జలమండలి ఈడీగా పని చేస్తున్న మయాంక్ మిట్టల్ ను జాయింట్ ఎండీగా ప్రభుత్వం నియమించింది.



**మల్కాజిగిరి జోన్:** కొత్తగా ఏర్పడిన జలమండలి మల్కాజిగిరి జోన్ నూతన ఈడీగా పంకజ బాధ్యతల స్వీకరణ.



**సెంట్రల్ (ఖైరతాబాద్) జోన్:** కొత్తగా ఏర్పడిన జలమండలి హైదరాబాద్ జోన్ నూతన ఈడీగా సామ్రాట్ అశోక్ బాధ్యతల స్వీకరణ.



**సైబరాబాద్ జోన్:** కొత్తగా ఏర్పడిన జలమండలి సైబరాబాద్ జోన్ నూతన ఈడీగా సంతోష్ బాధ్యతల స్వీకరణ.

ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ ఎండీ, ఈడీలు జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.



# ఎన్నికల అధికారుల తీరుపై ఎంపీ ఆగ్రహం

**నిజామాబాద్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్ చేశారు. హరిచరణ్ మార్వాడీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థిని పోలీసులు బయటకు పంపేశారని, ఎన్నికల సిబ్బంది తమకు సహకరించడం లేదని ఎంపీకి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎంపీ.. పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. సంగతి చూస్తాను అని పోలీసులను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం పంపిన ఎంపీ అర్వింద్.. బీజేపీ అభ్యర్థిని బయటకు పంపిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఎమ్మెల్యే భార్య స్టోర్‌లో చోరీ

- స్టోర్ ఉద్యోగి పనే అని గుర్తించిన పోలీసులు



**హైదరాబాద్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సతీమణి అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్న డిజైనర్ స్టోర్‌లో జరిగిన చోరీ కేసును బంజారాహిల్స్ పోలీసులు ఛేదించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఓ డిజైనర్ స్టోర్‌ను అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఈనెల 6న ఆ స్టోర్‌లో ఓ చోరీ జరిగింది. ఈ స్టోర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అమీనుల్ హక్(38) ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అస్సాంకు చెందిన ఈ నిందితుడు కొన్ని నెలలుగా స్టోర్‌లో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రివేళ పక్కా ప్రణాళికతో స్టోర్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా కిటికీ గుండా లోపలికి వెళ్లాడు. అక్కడ స్క్రూడ్రైవర్ సాయంతో లాకర్ తెరిచి రూ.2.43 లక్షల నగదును చోరీ చేశాడు. దోచుకెళ్లిన ఆ సొమ్మును తన ఇంట్లోని డస్ట్‌బిన్‌లో దాచాడు. మరుసటి రోజుఉదయాన్నే డ్యూటీకి వచ్చిన అమీనుల్ హక్.. స్టోర్‌లో దొంగలు పడ్డారంటూ హడావుడి చేశాడు. సీసీటీవీ కెమెరాల్లో స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. కిటికీ వద్ద లభించిన బూట్ల ముద్రలు కీలక ఆధారంగా నిలిచాయి. ఆ షూస్ ముద్రలు పూర్తిగా మ్యాచ్ కావడంతో అమీనుల్ హక్ గుట్టు రట్టయ్యింది.

# మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఉద్రిక్తతలు

- పలుచోట్ల పరస్పర ఘర్షణలు
- దొంగ ఓట్ల ఆరోపణలతో పోలీసుల జోక్యం



**హైదరాబాద్, ఫిబ్రవరి11 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. పోలింగ్ కొనసాగుతున్న వేళ పలు జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి ఘటనలు వెలుగుచూశాయి. పోలీసులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 పోలింగ్ బూత్‌ల వద్ద స్వల్ప ఘర్షణలు జరిగాయి. 14వ వార్డులో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగాయి. కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు 14వ వార్డులో భారీగా పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు 14 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పెద్ద ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని రాకాసిపేట్ పోలింగ్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వారిని అడ్డుకుని కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులోనూ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఓటర్లను ప్రలోభ పెడుతున్నారంటూ బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.బీజేపీ, బీఆర్ఎస్ ఇరువర్గాల మధ్య బాహాబాహీ చోటుచేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు.సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓ వ్యక్తి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడు. అప్పటికే మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన సదరు వ్యక్తి.. 28వ వార్డులో మరోసారి ఓటు వేసేందుకు వచ్చినట్లు గుర్తించారు. అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆ వ్యక్తి చేతి వేలికి సిరా గుర్తువేసి పోలింగ్ కేంద్రం నుంచి పంపించారు. చట్టపరంగా ఆ వ్యక్తిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370